



అట్టర్ ఫ్లాప్..!



- ఫెయిలైన 'మేమంతా సిద్ధం' సభ
- ఎండ వేడిమికి తట్టుకోలేక జారుకున్న జనాలు
- సీఎం వచ్చే సమయానికి సభా స్థలి ఖాళీ

నంద్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ చేపట్టిన 'మేమంతా సిద్ధం' కార్యక్రమం అట్టర్ ఫ్లాప్ అయింది. జనాలు ఎండ వేడిమికి తట్టుకోలేక అక్కడి నుంచి వెళ్లిపోయారు. సాయంత్రం జగన్ వచ్చే సమయానికి సభా స్థలి ఖాళీ అయింది. గురువారం ఆళ్లగడ్డలోని విడిది కేంద్రం నుంచి నంద్యాల వరకు బస్సు యాత్ర సాగింది. సాయంత్రం నంద్యాల పట్టణంలో సభలో సీఎం జగన్ ప్రసంగించారు. అట్టహాసంగా రెండో రోజు మొదలు పెట్టిన యాత్ర, సభ ఫెయిల్ కావడంతో సీఎం జగన్‌తోపాటు, జిల్లా నాయకుల ముఖాలన్నీ వాడిపోయాయి. ముప్పావు వంతు ఖాళీగా ఉన్న సభలోనే సీఎం జగన్ ప్రసంగించి, జిల్లాలోని ఆయా నియోజకవర్గాల అసెంబ్లీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

యాతన తప్ప ఏముంది..!

సభాస్థలిలో నాయకులకు తప్ప సభకు వచ్చిన సామాన్య ప్రజానీకానికి ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. దీంతో సభకు వచ్చిన వారంతా ఎండ వేడిమికి, దప్పికకు అలమటించారు. చివరలో ఉన్న వారికి నీటిని అందించిన, సభా ప్రాంగణం మధ్యలో ఉన్న వారికి నీరందించే వారు లేక ఇబ్బంది పడ్డారు. షామియానాలు కూడా లేకపోవడంతో ఎండకు అల్లాడిపోయారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారి పరిస్థితి మరింత దారుణం. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేయడంతో బయటకు వెళ్లే పరిస్థితి లేక అక్కడే ఉండ లేక అల్లాడిపోయారు. అయినా కొంతమంది బారికేడ్లు దూకి బయటకు వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు కళాశాల గేట్లు మూసేశారు.



సభ నుంచి వెళ్లిపోతున్న వైసీపీ నాయకులు

డబ్బులిచ్చి తరలించారు..

వైసీపీ నేతలు ఒక్కొక్కరికి రూ.200 ఇచ్చి జనాన్ని తరలించినట్లు తెలుస్తోంది. పురుషులకైతే క్వార్టర్ బాటిల్ అదనం. మందు బాబులు సభా ప్రాంగణంలోనే తాగిపడిపోయారు. బస్సు యాత్ర ఆళ్లగడ్డ నుంచి మొదలైన తర్వాత అదే మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో రైతులు, మేధావులతో ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేసేందుకు ముందుగా ప్రణాళికలు వేసుకున్నారు. వారు ఎంపిక చేసుకున్న వారు సీఎం జగన్‌తో మాట్లాడేవిధంగా వారిలోని కొంతమందికి టోకెన్లు కూడా జారీ చేశారు. ఆ టోకెన్ల వారిగా మాట్లాడించేలా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. అయితే వైసీపీ వారు అనుకున్నట్లుగా రైతులు, మేధావులు సమావేశానికి హాజరు కాకపోవడంతో, వచ్చిన వారితోనే ముఖాముఖి నిర్వహించినట్లు సమాచారం. వచ్చిన వారికి టోకెన్లు ఇచ్చి మాట్లాడించే ప్రయత్నం చేశారు. ఫలానా టోకెన్ వారు మాట్లాడాలని వైసీపీ వారు కోరారు. ఇలా అయితే తమకు అనుకూలంగా ఉన్న వారితోనే మాట్లాడించినట్లు తెలుస్తుందన్న ఉద్దేశంతో సీఎం జగన్ వారిని వారించారు. ఎవరైనా మాట్లాడవచ్చని చెప్పారు. ఎంపిక చేసిన వారు మాత్రమే మాట్లాడితే తమ సమస్యలు ప్రభుత్వానికి ఎలా



తెలుస్తాయని సమావేశానికి వచ్చిన వారు ఆవేదన వ్యక్తం చేశారు.

లెక్కకు మించి బస్సులు..

నంద్యాల సభ కోసం కడప, అనంతపురం, చిత్తూరు, కర్నూలు నుంచి బస్సులు వేసి మరీ జనాన్ని తరలించారు. లెక్కకు మించి బస్సులు సీఎం సభ కోసం వాడుకోవడంతో సామాన్య ప్రయాణికులు తమ తమ ఊళ్లకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇక నంద్యాలలో సభ ఏర్పాటు చేసిన ప్రాంతం నుంచి అటు నూనెపల్లి, ఇటు మునిసిపల్ రోడ్డు వైపు ఆంక్షలు విధించడంతో ఆ మార్గాల గుండా ప్రయాణించే వారికి ఇబ్బందులు తప్పలేదు. పాములపాడు మండలం నుంచి వచ్చిన బస్సు తిరుగు పయణం కాగా స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద డివైడర్‌కు ఢీకొంది. ఈ ప్రమాదంలో పాములపాడుకు చెందిన ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి.

రైతులను అడ్డుకున్న గంగుల అనుచరులు

- వారితోపాటు ఉన్న టీడీపీ నాయకులపై దాడికి యత్నం
- యర్రగుంట్ల సిద్ధం కార్యక్రమంలో ఉద్రిక్తత
- పోలీసుల రంగప్రవేశంతో సద్దుమణిగిన వివాదం



జగన్ సభా ప్రాంగణం వద్ద దృశ్యం

నంద్యాల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జగన్‌ను కలిసేందుకు వెళ్లిన రైతులను గంగుల ప్రభాకర్‌రెడ్డి తన అనుచరులతో అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసుల రంగప్రవేశంతో వివాదం సద్దుమణిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మేమంతా సిద్ధం కార్యక్రమంలో భాగంగా గురువారం శిరివెళ్ల మండలం యర్రగుంట్లలో జగన్ రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఇందులోభాగంగానే సాగు నీటి సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు రుద్రవరం మండలంలోని పలు గ్రామాల రైతులు యర్రగుంట్లకు బయలుదేరారు. వీరితోపాటు టీడీపీ మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, యర్రగుంట్ల-2 ఎంపీటీసీ కమతం జయరామిరెడ్డి, తెలుగు యువత ఆళ్లగడ్డ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కమతం రాజశేఖర్‌రెడ్డి, బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శీలం లక్ష్మీప్రసాద్, సత్తారు లక్ష్మిరెడ్డి, సత్తారు నాగిరెడ్డి, సునార్ షబ్బీర్‌లు ఉన్నారు. వీరంతా రైతులతో కలిసి వినతి పత్రం తీసుకొని జగన్ వద్దకు వెళ్తుండగా సభా ప్రాంగణ సమీపంలో నీటి పారుదల శాఖ ప్రభుత్వ సలహాదారుడు గంగుల ప్రభాకర్‌రెడ్డి అతని అనుచరులతో అడ్డుకున్నారు. దాడికి యత్నించడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు వెంటనే రంగప్రవేశం చేసి రైతులను అక్కడి నుంచి తీసుకెళ్లారు. దీంతో రైతులు, టీడీపీ నాయకులతో కలిసి మాజీ మంత్రి భూమా అఖిలప్రియతో శిరివెళ్ల పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. సీఎం సభకు వెళ్తుండగా మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, అతని అనుచరులు తనపై దాడి చేశారని యర్రగుంట్లకు చెందిన సునార్ షబ్బీర్ రాత పూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మాజీ మంత్రికి షోకాజ్ నోటీసు

ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి అఖిలప్రియకు ఆళ్లగడ్డ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో మల్లికార్జునరెడ్డి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఒక పార్టీ వారు సమావేశం నిర్వహించుకునే సమయంలో మరో పార్టీ వారు జోక్యం చేసుకోవడం ఎన్నికల నియమ నిబంధనలకు విరుద్ధమని, అక్కడికి ఎందుకు వెళ్లారన్న దానిపై వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసు జారీ చేశామని ఆళ్లగడ్డ ఎన్నికల అధికారి మల్లికార్జునరెడ్డి తెలిపారు.

ప్రజల్లో తిరిగే అర్హత వైసీపీ నాయకులకు లేదు

ప్రజల్లో తిరిగే అర్హత వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులకు ఏ మాత్రం లేదని, దౌర్జన్యకారులను ఆళ్లగడ్డ ప్రజలు ఎప్పటికీ ఆదరించరని టీడీపీ మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. జగన్‌కు రైతుల సమస్యలు వివరించేందుకు వెళ్తున్న టీడీపీ నాయకులపై రాష్ట్ర నీటి పారుదల శాఖ ప్రభుత్వ సలహాదారుడు గంగుల ప్రభాకర్‌రెడ్డి, అతని అనుచరులు దాడికి యత్నించడం హేయమైన చర్య అని ఆమె మండిపడ్డారు. రైతుల గోడు పట్టించుకోని వైసీపీకి రానున్న ఎన్నికల్లో రైతులు తగిన గుణపాఠం నేర్పుతారని హెచ్చరించారు.



యర్రగుంట్లలో మాట్లాడుతున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

క్షమాగుణం క్రీస్తు మార్గం

- నేడు గుడ్‌ఫ్రైడే
- చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు



కర్నూలు(కల్చరల్), మార్చి 28: క్షమాగుణం, దయామయ జీవనం, సౌభ్రాతృత్వం ఏసుక్రీస్తు మానవాళికి చూపిన మార్గం. మానవులు చేసిన పాపాల కోసం ఆయన శిలువపై ప్రాణాలు అర్పించాడు. తిరిగి మూడో రోజు సమాధి నుంచి లేచాడు. పొరుగు వారిని ప్రేమించాలని, వారి తప్పులను క్షమించాలని బోధించారు. క్రైస్తవ మత విశ్వాసం ప్రకారం యేసుక్రీస్తు శుక్రవారం శిలువ వేయబడ్డారు. ఈ నేపథ్యంలో క్రీస్తు ప్రభువును స్మరించుకుంటూ శుక్రవారం రోజున ఉమ్మడి జిల్లాలోని క్రైస్తవులు 'గుడ్‌ఫ్రై డే' వేడుకను నిర్వహించుకుకోడానికి సిద్ధమయ్యారు. దయామయుని తలుస్తూ ఉపవాసంతో ప్రార్థనలు చేస్తారు. ఈ సందర్భంగా అన్ని చర్చిలలో గుడ్‌ఫ్రైడే ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు.

నగరంలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు...

నగరంలోని సీఎస్ఐ చర్చి, కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి, స్టాంటన్ చర్చి, ప్రార్థన మందిరాలలో, వివిధ ప్రాంతాల్లోని చర్చిలలో శుక్రవారం గుడ్ ఫ్రై డే ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు.

ఉపాధి కూలి రోజుకు రూ.300

- ఏప్రిల్ నుంచి అమలు
- డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 28: ఉగాది పండుగ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పనులు చేసే రైతులు, రైతు కూలీలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఈ మేరకు గతంలో ఉన్న ఉపాధి కూలిని రూ.272 నుంచి రూ.300కు పెంచుతూ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆర్థిక సంవత్సరానికి పెరిగిన కూలీ ధరను ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు పంపిన ఉత్తర్వుల్లో సూచించింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఉపాధి హామీ పథకం పనులు చేసేందుకు జాబ్‌కార్డులు పొందిన దాదాపు ఆరు లక్షల మంది రైతులు, కూలీలకు ప్రయోజనం కలగనుంది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి దాకా అమలు చేస్తున్న రూ.272 కూలీ మొత్తాన్ని ఏప్రిల్ 1 నుంచి పెంచనుందని, కనీసం రూ.10 అదనంగా ఇచ్చే అవకాశం ఉందని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే.. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఏకంగా అదనంగా రూ.28 పెంచడంపై రైతుల్లో కూలీల్లో హర్షం వ్యక్తమవుతోంది. అయితే.. పెంచిన మొత్తాన్ని తప్పనిసరిగా పనులు చేసే రైతులు, కూలీలందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని నీటి యాజమాన్య సంస్థ జిల్లా అధికారి అమర్నాథ్ రెడ్డిని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం విజ్ఞప్తి చేశారు.

సీఎం సభకు డోన్ బస్సులు

విద్యార్థి బస్సులు రద్దవడంతో అవస్థలు



నంద్యాల జిల్లాలో సీఎం జగన్ బస్సు యాత్రకు వెళ్తున్న డోన్ ఆర్టీసీ బస్సులు

డోన్(రూరల్), మార్చి 28: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నంద్యాల జిల్లా బస్సు యాత్రకు డోన్ ఆర్టీసీ డిపో నుంచి 30 దాకా బస్సులు ఏర్పాటు చేశారు. దీంతో డోన్ ఆర్టీసీ అధికారులు గురువారం విద్యార్థి బస్సులను రద్దు చేశారు. పట్టణ సమీపంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌కు వెళ్లేందుకు విద్యార్థులు బస్సు కోసం మధ్యాహ్నం 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు డోన్ పాతబస్టాండులో వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థి బస్సులు రద్దయిన సమాచారం వారికి తెలియక పాతబస్టాండులోనే గంటసేపు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయం డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శశి భూషణ్ దృష్టికి తీసుకెళ్లగా డోన్ ఆర్టీసీ డిపో పరిధిలో సీఎం జగన్ బస్సు యాత్ర కార్యక్రమానికి 30 బస్సులు కేటాయించామని, దీంతో విద్యార్థి బస్సులు రద్దు చేసినట్లు ఆయన తెలిపారు.



డోన్ పాతబస్టాండులో బస్సుల కోసం వేచి ఉన్న విద్యార్థులు

త్వరలో టీడీపీలోకి కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి

బనగానపల్లె, మార్చి 28; బనగానపల్లె రాజకీయాల్లో పెను మార్పులు జరుగనున్నాయి. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సోదరుడు, వైసీపీ నాయకుడు కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి వైసీపీని వీడనున్నారు. గురువారం తన ఇంటికి వచ్చిన బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డికి చంద్రశేఖర్‌రెడ్డి పూలమాలతో స్వాగతం పలికారు. అనంతరం బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డితో కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి సుదీర్ఘ చర్చలు జరిపారు. అనంతరం చర్చలు ఫలించినట్లు తెలుస్తోంది. త్వరలో కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి వైసీపీని వీడి టీడీపీలో చేరడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం బనగానపల్లెకు రానున్న చంద్రబాబునాయుడు సమక్షంలో కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి టీడీపీలో చేరనున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బేతంచెర్ల సోమశేఖర్‌రెడ్డి, వంగాల పరమేశ్వర్‌రెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరనున్న కోవెలకుంట్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కిరణ్‌కుమార్ : మాజీ గవర్నర్ పెండేకంటి వెంకటసుబ్బయ్య రాజకీయ వారసుడు, ప్రస్తుతం

వైసీపీని వీడనున్న మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కిరణ్‌కుమార్



వైసీపీ నాయకుడు కాటసాని చంద్రశేఖర్‌రెడ్డితో చర్చలు జరుపుతున్న బీసీ, బైరెడ్డి

వైసీపీలో ఉన్న కోవెలకుంట్ల మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ పెండేకంటి కిరణ్‌కుమార్ వైసీపీని వీడి టీడీపీలో చేరనున్నారు ఈమేరకు గురువారం పెండేకంటి కిరణ్‌కుమార్ బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో బీసీ జనార్దన్‌రెడ్డితో చర్చలు జరిపారు. సంజామల వైసీపీ నాయకుడైన కిరణ్‌కుమార్‌రెడ్డి గత కొంతకాలంగా ఆ పార్టీకి దూరంగా ఉంటున్నారు.

మేమింతే...

ప్రచారంలో పలువురు వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు



సిద్ధం సభకు వెళ్లిన యు. కొత్తపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ మధు



వెంకటనాయునిపల్లెలో వలంటీర్ ప్రసాద్

డోన్, మార్చి 28: డోన్ నియోజకవర్గంలో వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ల తీరు మారడం లేదు. ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘించి పలువురు వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు వైసీపీ ప్రచారంలో చురుకుగా పాల్గొంటున్నారు. తామింతే అంటూ సవాల్ విసురుతున్నారు. అయినా ఎన్నికల అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. గురువారం నంద్యాలలో జరిగిన వైసీపీ సిద్ధం సభకు డోన్ మండలంలోని యు.కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ మధు, వెంకటనాయునిపల్లెకు చెందిన వలంటీర్ ప్రసాద్‌లు తరలి వెళ్లారు. ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొనకూడదని నిబంధనలున్నావాటిని బేఖాతర్ చేస్తున్నారు. ఇప్పటికైనా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష పార్టీల నాయకులు కోరుతున్నారు.



దిగువ అహోబిలంలోని కోనేటిలో తెప్పోత్సవం

దిగువ అహోబిలంలో రెండో రోజు తెప్పోత్సవం

నంద్యాల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): దిగువ అహోబిలంలో ప్రహ్లాద వరదస్వామికి, శ్రీదేవి, భూదేవి, అమృతవల్లి అమ్మవార్లకు గురువారం తెప్పోత్సవ కార్యక్రమాన్ని రెండో రోజు వేదపండితులు చేపట్టారు. అహోబిలం బ్రహ్మోత్సవాల్లో స్వామి, అమ్మవార్లు వివిధ వాహన సేవల్లో అలసిపోయి ఉండటంతో వారికి తెప్పోత్సవ కార్యక్రమంతో సేద తీర్చుతున్నామని వేదపండితులు చెప్పారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా పూలమాలలతో అలంకరించి, పూజలు నిర్వహించి తెప్పోత్సవం చేపడుతున్నామన్నారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.1.81 కోట్లు

శ్రీశైలం, మార్చి 28: శ్రీశైల మహా క్షేత్రంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. లెక్కింపులో ఆలయ హుండీల ద్వారా రూ.1,81,13,485లు నగదు రూపంలో రాబడిగా లభించింది. ఆలయ హుండీ ఆదాయాన్ని భక్తులు గత 16 రోజులలో సమర్పించారు. నగదుతో పాటు 178 యూఎస్ఏ డాలర్లు, 20 సౌదీ అరేబియా రియాల్స్, 20 యూకే పౌండ్స్, 5 ఆస్ట్రేలియా డాలర్లు, మొదలైన విదేశీ కరెన్సీ ఈ హుండీ లెక్కింపులో లభించాయి. పటిష్టమైన భద్రతా, సీసీ కెమెరాలు, అధికారుల పర్యవేక్షణలో ఈ హుండీ లెక్కింపును నిర్వహించారు. ఈ హుండీ లెక్కింపులో కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, అన్ని విభాగాల అధిపతులు, పర్యవేక్షకులు, సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.



డబ్బులు ఎక్కడ జగనన్నా..!



- బటన్లు నొక్కినా జమకాని నిధులు
- ఎదురు చూస్తున్న పలు పథకాల లబ్ధిదారులు
- వస్తాయో రావోనన్న ఆందోళన

నంద్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి):

'ఎన్నికల కోడ్ మరో కొద్ది రోజుల్లో వస్తుంది కాబట్టి ప్రస్తుతం బటన్ మాత్రమే నొక్కుతున్నాను. డబ్బులు మరికొద్ది రోజుల్లో పడతాయి. వైసీపీ ప్రభుత్వం ఇలా చేస్తున్నందుకు లబ్ధిదారులు ఏమీ భయపడాల్సిన అవసరం లేదు. ఈ కొద్ది రోజులు నాకు వ్యతిరేకంగా రాసే పత్రికలను చూడవద్దు' ఇదీ ఈ నెల 14న బనగానపల్లెలో ఈబీసీ నేస్తం పథకం బటన్ నొక్కుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటలు. ఈబీసీ నేస్తం డబ్బులు మాత్రమే జమ కాలేదంటే సరేలే అనుకోవచ్చు. ఈ సంవత్సరం జనవరి నుంచి వివిధ పథకాల లబ్ధిదారులకు డబ్బులు జమ చేసే బటన్ నొక్కుతూనే ఉన్నారు. అయినా లబ్ధిదారులకు డబ్బులు జమ కాలేదు. వారి ఇబ్బందులు తీరలేదు. ఇలా అబద్ధాలు చెబుతున్న జగన్ మళ్లీ ఎన్నికల ప్రచారానికి రావడంపై జిల్లా ప్రజలు తీవ్ర వ్యతిరేకత చాటుకుంటున్నారు.

అందని విద్యా దీవెన..

వృత్తి విద్యా కోర్సులు, డిగ్రీ విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన ద్వారా ప్రభుత్వం ఫీజుల సొమ్మును వాయిదా రూపంలో వారి తల్లుల ఖాతాల్లో జమ చేస్తోంది. ఈ ఏడాది విద్యా దీవెన పథకానికి సంబంధించి సీఎం జగన్ ఈ సంవత్సరం మార్చి 1న బటన్‌ను నొక్కారు. జిల్లా వ్యాప్తంగా 30,136 మంది తల్లులకు 33481 మంది విద్యార్థులకుగాను రూ.24.44 కోట్లు వైసీపీ ప్రభుత్వం విడుదల చేసింది. అయితే ఈ డబ్బులు ఇంకా తల్లుల ఖాతాల్లో జమ కాలేదు. దీంతో తల్లిదండ్రులు విద్యార్థుల ఫీజు కట్టలేకపోయారు. పరీక్షలు దగ్గర పడుతుండటంతో ఫీజులు చెల్లించాలంటూ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల మీద ఒత్తిడి తెస్తున్నాయి. విద్యార్థులు చదువుల మీద మనసు లగ్నం చేయలేక ఇబ్బంది పడుతున్నారు. 'చెప్పాడంటే.. చేస్తాడంతే!' అంటూ వైసీపీ నాయకులు గొప్పలు పోవడం తప్పితే, సీఎం జగన్ చేస్తున్నది ఏమీ లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పథకాలు అందిస్తున్నామని చెబుతూ తమని మోసం చేయటమే కాక, తమ పిల్లల భవిష్యత్తుతో ఆటలు ఆడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు సీఎం జగన్ మీద ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏదీ చేయూత..?

తమది పూర్తిగా పేదల పార్టీ అని.. అందుకే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు చెందిన 45-60 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న పేద మహిళలకు ఏటా రూ.18,500 అందించేందుకు వైఎస్సార్ చేయూత పథకాన్ని తీసుకు వచ్చామని సీఎం జగన్ బాకా ఊదారు. ఈ పథకం నిధులు విడుదల చేసే కార్యక్రమాన్ని ఈ నెల 7వ తేదీన నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లాకు చెందిన 97,254 మంది మహిళలకు రూ.182.35 కోట్లు విడుదల చేశారు. సీఎం బటన్ నొక్కారని, ఇక తమ ఖాతాల్లో డబ్బులు జమ కావడమే తరువాయి అని ఆశ పడ్డ మహిళలకు నిరాశే మిగిలింది. వైసీపీ ప్రభుత్వం ఇస్తానన్న చేయూత అంతా వట్టిదేనని, సీఎం జగన్ ఇలా తమను మభ్యపెట్టడం భావ్యం కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ఈబీసీ కాపు నేస్తం అంతేనా..?



ఈబీసీ నేస్తం ద్వారా అగ్రవర్ణ పేదలకు అంతులేని మేలు చేస్తున్నానంటూ, జిల్లాలో ప్రస్తుతం 17,652 మందికి రూ.26 కోట్లు అందిస్తున్నట్లు ఈ నెల 14న బనగానపల్లె సభలో సీఎం జగన్ చెప్పారు. పనిలో పనిగా ప్రస్తుతానికి బటన్ మాత్రమే నొక్కుతున్నానని, డబ్బులు వారం పది రోజుల తర్వాత పడతాయని చావు కబుర్లు చల్లగా చెప్పారు. పైగా తాను మంచి చేద్దామని చూస్తుంటే కొన్ని పత్రికలు తనకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నాయని, కొద్ది రోజులు వాటిని చూడవద్దంటూ కూడా ప్రజలను కోరారు. అయితే సీఎం జగన్ చెప్పిన మాటలను విన్నవారంతా నవ్వుకున్నారు. గతంలో ఒత్తిన బటన్‌ల డబ్బులే ఇంకా రాలేదని, ఇపుడు ఒత్తే బటన్ పరిస్థితి కూడా ఇంతేనని, అదంతా బయట పడకుండా ప్రజలను మభ్యపెట్టేందుకు ఇలా ప్రతిపక్ష పార్టీలను, తనకు అనుకూలంగా లేని పత్రికలపై ఆడిపోసుకుంటున్నాడన్న అభిప్రాయం వ్యక్తమయింది. ఒకవేళ సీఎం చెప్పిన దానిలో నిజం ఉంటే.. బటన్ నొక్కి రెండు వారాలైనా ఇప్పటికీ డబ్బు ఎందుకు పడలేదన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

● ఇదీ ఆసరా లబ్ధిదారులు పరిస్థితి..

గత ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగా అప్పటి ప్రతిపక్ష నేత సీఎం జగన్ అలివి గాని హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక తాను అక్కచెల్లెమ్మలకు అండగా ఉంటానని, పొదుపు సంఘాలు 2019 ఏప్రిల్ వరకు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తానని చెప్పారు. అందులో భాగంగా నాలుగో విడత నిధులను ఈ సంవత్సరం జనవరి 23న బటన్ నొక్కి విడుదల చేశారు. జిల్లాలోని 21017 గ్రూపుల్లోని 209707 మంది మహిళలకు రూ.136.18 లక్షలు విడుదల చేశామని, అవి త్వరలోనే లబ్ధిదారులు ఖాతాల్లో జమ అవుతాయని చెప్పారు. ఈ విషయాన్ని జిల్లాలోని ఆయా మండలాలు, వార్డుల వారీగా వైసీపీ నేతలు విపరీతంగా ప్రచారం చేసుకున్నారు. అయితే ఇప్పటి వరకు జిల్లాలోని 50 శాతం మందికి కూడా వీటికి సంబంధించిన నిధులు జమ కాలేదని తెలుస్తోంది. సీఎం జగన్ బటన్ నొక్కి రెండు రెండు నెలలు గడిచినా ఇప్పటికి డబ్బులు వేయలేదని, ఇది తమను మోసం చేయటమేనని డబ్బులు అందుకోని మహిళలు మండిపడుతున్నారు.

ఏం చేశారని ఎమ్మిగనూరుకు వస్తున్నారు

సీఎం జగన్‌ను ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే బీవీ



ఎమ్మిగనూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీవీ

ఎమ్మిగనూరు, మార్చి 28: జిల్లాలో గతంలో ఇచ్చిన హామీలు ఏవీ నెరవేర్చకుండా ఏ ముఖం పెట్టుకొని ఎమ్మిగనూరుకు వస్తున్నారని సీఎం జగన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి ప్రశ్నించారు. గురువారం ఎమ్మిగనూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్ కర్నూలులో హైకోర్టు, న్యాయరాజధాని ఏర్పాటు చేస్తామని, సీపీఎస్ రద్దు చేస్తామని, మద్యనిషేధం, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని విమర్శించారు. ఓట్లకోసం నేడు జగన్ బస్సులో వస్తున్నారని ఇప్పుడు తెలుస్తుందని ఈ ఐదేళ్లలో రోడ్లు ఎలా ఉన్నాయోనన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో పిడికెడు మన్ను వేసిన పాపాన పోలేదన్నారు. ఎల్లెల్సీ కింద అదనంగా ఒక్క ఎకరాకు నీరు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. పశ్చిమ ప్రాంతంలోని ప్రజలకు సాగు,తాగునీరు అందించాలన్న సంకల్పంతో చంద్రబాబును ఒప్పించి ఆర్డీఎస్ కుడికాలువ కోసం రూ.2వేల కోట్లు మంజూరు చేయిస్తే రివర్స్ టెండర్ పేరుతో ప్రాజెక్టును సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు మాధవరావు దేశాయ్, రఘుమూర్తి స్వామి, మల్లికార్జున, బడేసాబ్, సుందరరాజు పాల్గొన్నారు.

ఉత్కంఠగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

అధ్యక్షుడిగా బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా రవికాంత్ ప్రసాద్



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో కార్యవర్గ సభ్యులు

కర్నూలు(లీగల్), మార్చి 28: ఉత్కంఠగా గురువారం జరిగిన కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలలో బి. కృష్ణమూర్తి అధ్యక్షుడిగా, బీఎస్ రవికాంత్ ప్రసాద్ ప్రధాన కార్యదర్శిగా ఘన విజయం సాధించారని ఎన్నికల అధికారి సి. ప్రభాకర్ రెడ్డి ప్రకటించారు. బి.కృష్ణమూర్తి తన సమీప ప్రత్యర్థి బి. చంద్రుడుపై 38 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. కృష్ణమూర్తికి 358 ఓట్లు రాగా, చంద్రుడికి 320 ఓట్లు వచ్చాయి. ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బీఎస్ రవికాంత్ ప్రసాద్‌కు 436 ఓట్లు రాగా, ఆయన ప్రత్యర్థి ఎం. వెంకటే శ్వర్లుకు 165 ఓట్లు వచ్చాయి. సంయుక్త కార్యదర్శిగా డి. విక్రమ్‌సింగ్, కోశాధికారి గా ఎం.మహబూబ్‌బాషా, గ్రంథాలయ కార్యదర్శిగా ఎస్. రామనాథ్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా బి.సుధీర్, మహిళా ప్రతినిధిగా సుమన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అంతకుముందు గురువారం ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరిగింది. 850 ఓట్లు ఉండ గా.. 689 ఓట్లు పోలయ్యాయి. ఆ తర్వాత మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు ప్రక్రియ ను ప్రారంభించి సాయంత్రానికి ఫలితాలు ప్రకటించారు. బి. కృష్ణ మూర్తికి, బీఎస్ రవికాంత్ ప్రసాద్‌లకు న్యాయవాదులు మిఠాయిలు అం దించి అభినం దనలు తెలిపారు. ఎన్నికల అధికారులుగా సీ. ప్రభాకర్ రెడ్డి, మద్దెల శ్రీనివాస రెడ్డి, కే. రాజమోహన్ రెడ్డి, ఎస్ఏ ఇందుమతి, బాబా సాహెబ్ పాల్గొన్నారు.

రూ. 41.30 లక్షల బంగారం స్వాధీనం

ఆదోని, మార్చి 28 : ఆదోని రైల్వేస్టేషన్‌లో పోలీసులు జరిపిన సోదాలలో గురువారం రూ.41.30 లక్షల విలువ చేసే బంగారం స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ గోపాల్ తెలిపారు. ఆదోని రైల్వే స్టేషన్‌లో బసవ ఎక్స్‌ప్రెస్ రైలులో ముల్లా అహమ్మద్ అనే వ్యక్తిని సోదా చేయగా బ్యాగులో రెండు బిస్కెట్ల బంగారం ముక్కలు లభించాయని ఆయన తెలిపారు. వీటి విలువ సుమారు రూ.41.30 లక్షలు ఉంటుందన్నారు. వీటికి బిల్లులు, రసీదులు చూపించకపోవడంతో ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించామని తెలిపారు.



స్వాధీనం చేసుకున్న బంగారు బిస్కెట్లు

బాబు పర్యటనకు తరలి రండి



నాయకులు, కార్యకర్తలకు బీసీ పిలుపు

బనగానపల్లె, మార్చి 28: బనగానపల్లె పట్టణానికి శుక్రవారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వస్తున్నం దున నాయకులు, కార్యకర్తలు ఉదయం 9.30 గంటల కల్లా తరలి రావాలని పిలుపుని చ్చారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అరాచక పాలనకు అంతం పలికేందుకు చంద్రబాబు యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. బనగానపల్లె పట్టణంలోని పెట్రోల్ బంకు వద్ద భారీ బహిరంగ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాల్లోని అన్ని గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలి రావాలని బీసీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో సందడి నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు టీడీపీ కార్యకర్తలు, నాయకులతో బీసీ సమా లోచన జరిపి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబునాయుడు పర్యటన ఇలా..

శ్రీసత్యసాయి జిల్లా కదిరి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.55 గంటలకు బనగానపల్లె పట్టణ శివారులోని క్రాంటెడ్డి లేఔట్ వద్దకు చేరుకుంటారు. ఇక్కడ ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి కారులో బనగానపల్లె పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వద్దగల పెట్రోల్ బంకు కూడలికి 11 గంటలకు చేరుకుంటారు. ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు చైతన్య రథంపై జరిగే బహిరంగ సభలో చంద్రబాబునాయుడు ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. 12.40 గంటల నుంచి 1.40 గంటల మధ్యలో బీసీ నివాసంలో మధ్యాహ్న భోజనం చేస్తారు. భోజనం అనంతరం మధ్యాహ్నం 1.45 గంటలకు హెలికాప్టర్ ఎక్కి నెల్లూరు జిల్లా కావలిలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొనేందుకు వెళ్తారు. నాయకులు, కార్యకర్తలకు కోవెలకుంట్ల రహదారిలోని మార్కెట్ యార్డు వద్ద, జీఎంఆర్ ఫంక్షన్ హాలు వద్ద, యాగంటి రహదారిలోని మర్రిమాను వద్ద భోజన వసతి కల్పించారు.



బనగానపల్లెలో సిద్ధం చేసిన హెలిప్యాడ్

సీమ ప్రాజెక్టులపై వైఖరి చెప్పాలి

- 12 నుంచి ప్రాజెక్టుల సందర్శన వాస్తవ పరిస్థితిని ప్రజలకు వివరిస్తాం
- సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల టౌన్, మార్చి 28 : రాయలసీమ ప్రాజెక్టుల పరిస్థితి నానాటికీ దిగజారుతున్నదని, ప్రాజెక్టులపై అన్ని రాజకీయ పార్టీలు స్పష్టమైన వైఖరి ప్రకటించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. గురు వారం నంద్యాలలో సాగునీటి సమితి కార్యాలయంలో ప్రజా సం ఘాల నాయకులతో కలిసి తాగు, సాగు నీటి ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడు తూ రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల వాస్తవ స్థితిని సమాజం దృష్టికి తీసుకొని పోవడానికి ఏప్రిల్ 12వ తేదీ నుంచి ప్రాజెక్టుల సందర్శన కార్యక్రమాన్ని చేపడుతున్నామని ప్రకటించారు. ఒకే రాజధాని, మూడు రాజధానుల విధానాలను పాలకులు తమ ఆర్థిక, రాజకీయ సామ్రాజ్యాలను విస్తరించుకోవడానికి అమరావతిలో, విశాఖలో ఏర్పాటు చేయాలనుకుంటున్నారని విమర్శించారు. రాయల సీమ అభివృద్ధికి, రాయలసీమ యువతకు ఉద్యోగావకాశాలు లేకుండా చేసే ఈ విధానాలను ప్రజలకు వివరించే కార్యక్రమం చేపడుతున్నామని అన్నారు. పాలకుల అస్తవ్యస్త విధానాలతో రాయలసీమ యువతకు జరిగే నష్టాన్ని సమాజం ముందుం చుతామని అన్నారు. రాయలసీమలో రాజధాని లేదా హైకోర్టు ఏర్పాటు, రాయలసీమ యువతకు రాష్ట్ర స్థాయి ఉద్యోగాలలో 40 శాతం రిజర్వేషన్లు, చిన్నాభిన్నమైన రాయలసీమ సాగునీటి వ్యవస్థను గాడిలో పెట్టే విషయంలో రాజకీయ పార్టీలు తమ కార్యాచరణను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు సుంకన్న, రాయలసీమ సాగునీటి సాధన సమితి కర్నూలు కార్యనిర్వాహక సభ్యుడు డేవిడ్, జనచైతన్య వేదిక నాయకులు శేషాద్రిరెడ్డి, రాయలసీమ ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు పలువురు పాల్గొన్నారు



మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

ఎన్నికల కమిషన్ ఆదేశాలు బేఖాతర్

- వైసీపీ ఎన్నికల ప్రచారంలో ఎండీయూ ఆపరేటర్
- ప్రచారంలో పాల్గొంటున్న ఎండీయూ ఆపరేటర్లు, వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు

కోసిగి, మార్చి 28: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి పది రోజులవుతున్నా గ్రామ వలంటీర్లు, ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎండీయూ ఆపరేటర్లు వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నారు. ఇప్పటికే కోసిగిలో వైసీపీ మండల ఇన్‌చార్జి మురళి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రెండు రోజులుగా ఇంటింటికి ఎన్నికల ప్రచారాన్ని మొదలు పెట్టారు. వైసీపీ నాయకులతో కలిసి ఇందులో ఎండీయూ ఆపరేటర్ బాలయేసు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బాలయేసుతో పాటు సుమారు పదిమంది వలంటీర్లు, ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు రోజూ వైసీపీ నాయకుల వెంట తిరుగుతూ ఎన్నికల ప్రచారాలు చేస్తున్నారు. వీరిపై నిఘా ఉంచాల్సిన అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోసిగికి చెందిన సుమారు ఐదుగురు వలంటీర్లు, గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు వైసీపీ ఎన్నికల ప్రచారాల్లో యథేచ్ఛగా పాల్గొడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.



వైసీపీ ప్రచారంలో నాయకులతో కలిసి ఉన్న (రౌండప్)లో ఉన్న ఎండీయూ ఆపరేటర్ బాలయేసు

భార్యే నిందితురాలు

- కొడుకు, ప్రియుడు పాత్రధారులు
- పోలీసు విచారణలో అంగీకరించిన నిందితులు



నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

దేవనకొండ, మార్చి 28: దేవనకొండ మండలం గుండ్లకొండ గ్రామానికి చెందిన పల్లె లక్ష్మన్న(55)ను కుటుంబ సభ్యులే హతమార్చిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. దేవనకొండ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు... గుండ్లకొండ గ్రామానికి చెందిన పల్లె లక్ష్మన్న, పద్మావతి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. లక్ష్మన్నకు కుమారుడు, కుమార్తె సంతానం. పద్మావతిది పత్తికొండ మండలం చక్రాల గ్రామం. భార్యాభర్తలు తరచూ గొడవపడేవారు. అలిగి పద్మావతి పుట్టింటికి వెళ్లేది. చక్రాల గ్రామానికి చెందిన బోయ మల్లయ్యతో పద్మావతికి వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న లక్ష్మన్న మద్యానికి బానిసై భార్యను వేధించేవాడు. దీంతో ఎలాగైనా భర్తను హత మార్చాలని కుమారుడు వెంకటేష్, ప్రియుడు మల్లయ్యతో కలిసి పద్మావతి పథకం వేసింది. ఇందులో భాగంగానే ఫిబ్రవరి 16న రాత్రి చిత్రాన్నంలో నిద్రమాత్రలు కలిపింది. అది తిన్న లక్ష్మన్న మత్తులోకి వెళ్లగా పథకం ప్రకారం కుమారుడు, ప్రియుడితో కలిసి ఉరివేసింది. చనిపోయిన తర్వాత కారులో మృతదేహాన్ని తీసుకువచ్చి పామిడి పెన్నానది ఒడ్డున కంపచెట్లలో పారేశారు. అనంతరం నెల రోజులకు తండ్రి కనిపించడం లేదని కుమారుడు పల్లె వెంకటేష్ దేవనకొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పద్మావతితోపాటు ఆమె కుమారుడిని పోలీసులు తమదైన శైలిలో విచారించగా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. విషయం తెలుసుకున్న సీఐ సిబ్బందితో పామిడి పెన్నానది ఒడ్డున ఉన్న మామిడితోట సరిహద్దులో వెతకగా అప్పటికే శరీరం కుళ్లిపోయింది. ఆ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి పంచనామా చేశారు. హత్యకు పాల్పడిన భార్య పద్మావతి, కుమారుడు వెంకటేష్, మల్లయ్యలను అరెస్టు చేసి కారు, మూడు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు.

వైద్య పరికరాల కొనుగోలుకు టెండర్లు



కర్నూలు జీజీహెచ్ పరికరాల కొనుగోలు టెండర్లను నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్

కర్నూలు(హాస్పిటల్), మార్చి 28: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో కోటి రూపాయల విలువ గల వైద్యపరికరాల కొనుగోలుకు గురువారం డిస్ట్రిక్ట్ పర్చేజ్ కమిటీ చైర్‌పర్సన్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య టెండర్లు నిర్వహించారు. డెక్సాస్కాన్, మూడు అనస్తీషియా వర్క్ స్టేషన్లు, నెఫ్రాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాలకు రెండు స్కానింగ్ మిషన్లు, 20 ఏసీల కొనుగోలుకు సంబంధించిన టెండర్లు వేసినట్లు కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.వి. వెంకటరంగారెడ్డి తెలిపారు. ఈ వైద్య పరికరాలను ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ (హెచ్‌డీఎస్) నిధుల నుంచి కొనుగోలుకు ఆమోదం లభించిందన్నారు. 20 ఏసీల్లో అత్యవసర విభాగమైన ఏఎంసీ, చిన్న పిల్లల అత్యవసర విభాగం ఎస్ఐసీయూ, పలు ఆపరేషన్ థియేటర్లలో త్వరలో అందుబాటులో తీసుకు వస్తామని చెప్పారు. ఈ వైద్య పరికరాల ద్వారా రోగులకు మెరుగైన సేవలతోపాటు వైద్యులకు పరిశోధన చేయడానికి ఉపయోగపడనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ మేనేజర్ సివిల్ సప్లయర్ షర్మిళ, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చిట్టి నరసమ్మ, వైస్ ప్రిన్సిపాల్ హరిచరణ్, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్, ఆసుపత్రి ఏడీ అనిల్ కుమార్ రెడ్డి హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

జూటూరు గ్రామ సందర్శన



జూటూరు గ్రామంలో పర్యటిస్తున్న ఎంపీడీవో సరస్వతి

పాములపాడు, మార్చి 28: మండలంలోని జూటూరు గ్రామాన్ని గురువారం ఎంపీడీవో సరస్వతి సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఎంసీసీలో భాగంగా మండల టీమ్ ఎంపీడీవో ఆధ్వర్యంలో గ్రామంలోని అంతర్గత రహదారులు పరిశీలించి, సచివాలయాలు తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి అధికారి ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ రామేశ్వర్ పాల్గొన్నారు.

'పౌష్టికాహారంతో ఆరోగ్యం'



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ

కొత్తపల్లి, మార్చి 28: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని కొత్తపల్లి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ సూచించారు. గురువారం కొత్తపల్లిలోని ఎంపీయూపీ పాఠశాలలో పోషకాహార పక్షోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. 3వ అంగన్‌వాడీ సెంటర్ పరిధిలోని బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. అలాగే రకరకాల వంటలు తయారు చేసి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి చిన్నస్వామి, మహిళా పోలీసు భారతీదేవి, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శ్రీశైలంలో వైసీపీకి షాక్

- త్వరలో టీడీపీలో చేరుతున్నట్లు నాయకుడి ప్రకటన

శ్రీశైలం, మార్చి 28: శ్రీశైలం మండలంలో వైసీపీకి మరో షాక్ తగిలింది. సుండిపెంట గ్రామానికి చెందిన వైసీపీ మండల అధ్యక్షుడు, జిల్లా వైస్ ప్రెసిడెంట్, వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సెక్రటరీ గుండయ్య యాదవ్ శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్నట్లు ఆయన మీడియాతో తెలిపారు. వైసీపీ పాలనలో మండలంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీతోనే మండల అభివృద్ధి సాధ్యమని, తమ సన్నిహితులు, కార్యకర్తలతో కలిసి త్వరలోనే టీడీపీలో చేరనున్నట్లు తెలిపారు.

1 నుంచి ఆలయ వార్షికోత్సవం

ఆత్మకూరు, మార్చి 28: ఆత్మకూరు పట్టణంలోని భూవరాహ సహిత పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ద్విపుష్కర వార్షికోత్సవం ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానుంది. ఈ ఉత్సవాల్లో భాగంగా నిత్య పూజలతో పాటు హోమాలు, ప్రత్యేక పూజక్రతువులను వేదపండితుల పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా చేపట్టనున్నారు. ఏప్రిల్ 1న వార్షిక వేడుకలకు అంకురార్పణ పలికి విశేష పూజలు నిర్వహించనున్నారు. 2న సంతానార్థుల కోసం గరుడ ప్రసాద కార్యక్రమం, 3న లక్ష్మీ అమ్మవారికి అభిషేకం, అలంకరణతోపాటు లక్ష్మీదేవి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, వాహనోత్సవాలను జరపనున్నారు. అదేవిధంగా 4న గోదాదేవి అమ్మవారికి అభిషేకం, అలంకరణ, గోదాదేవీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించనున్నారు. 5న సాయంత్రం ఉత్సవమూర్తులకు లక్షపుష్పార్చన, వాహనోత్సవాలను నిర్వహించనున్నారు. 6న వార్షికోత్సవ మహా పూర్ణాహుతితో వేడుకలకు ముగింపు పలకడంతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అదేరోజు సాయంత్రం 6.30గంటలకు స్వామి, అమ్మవార్లకు కళ్యాణోత్సవాన్ని వేదపండితుల సమక్షంలో నిర్వహించేలా ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు దేవరపల్లి అనిల్‌కుమార్ వెల్లడించారు.

'అర్చకులపై దాడి అమానుషం'

బండిఆత్మకూరు, మార్చి 28: కాకినాడలోని పెద్దశివాలయంలో ఇటీవల అర్చకులపై వైసీపీ నాయకుడుదాడి చేయటం అమానుషమని శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ సభ్యుడు డాక్టర్ చిట్టిబొట్ల భరద్వాజశర్మ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో అర్చకులపై దాడులు పెరిగిపోయాయని ఆరోపించారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, అర్చకులకు ప్రభుత్వాలు భద్రత కల్పించాలని కోరారు.

ఆసక్తి చూపని జనం

- జగన్ సభకు వెళ్లే బస్సుల్లో కనిపించని ప్రజలు
- తలలు పట్టుకున్న వైసీపీ నాయకులు

ఆత్మకూరు, మార్చి 28: నంద్యాలలో వైసీపీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన జగన్ సభకు వెళ్లేందుకు ప్రజలు ఆసక్తి చూపలేదు. దీంతో డబ్బులిచ్చి మరీ జనాన్ని తరలించినట్లు ప్రచారం జరుగుతోంది. చాలా చోట్ల బస్సులు ఎక్కేందుకు జనం లేకపోవడంతో మహిళలకు రూ.300, పురుషులకు రూ.500 ఇచ్చి మరీ తరలించినట్లు విమర్శలు ఉన్నాయి. అదనంగా బిర్యాని వంటి భోజనాలను కూడా ఏర్పాటు చేసినట్లు సమాచారం. అలాగే అవసరమైన వారికి మద్యం, బిర్యానీలను కూడా కావాల్సినంతగా సమకూర్చినట్లు వినికిడి. రంజాన్ మాసం నేపథ్యంలో ఉపవాస దీక్షలు ఉండే ముస్లింలకు కూడా జగన్ సభకు వచ్చినట్లయితే ఉపవాస దీక్ష అనంతరం వారికి ఖర్జురాలు, బిర్యానీలు, ఇతర ఆహార పదార్థాలను కూడా ఆయా బస్సుల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిసింది. అదేవిధంగా ఒక్కో బస్సుకు ఖర్చుల నిమిత్తం నాయకులకు రూ.13వేల నుంచి రూ.20 వేల వరకు వెచ్చినట్లు సమాచారం. అంతేకాకుండా గ్రామాల్లో ఉత్సాహంగా పని చేసే కార్యకర్తలకు కూడా జనాన్ని తరలించేందుకు కూడా భారీగానే నగదును ముట్టజెప్పినట్లు ప్రచారం. సభకు జనాన్ని తీసుకొచ్చే నాయకులు కూడా ఎంతమందిని తీసుకొచ్చారన్నది సెల్ఫీలు పెట్టాలని చెప్పడంతో సెల్ఫీ ఫోటోల్లో జనాన్ని కనిపించేందుకు వైసీపీ నాయకులు నానాపాట్లు పడ్డారు.

బండిఆత్మకూరు: నంద్యాలలో సీఎం జగన్ సభకు ఆర్టీసీ బస్సులు సగానికి సగం ఖాళీగా వెళ్లాయి. గురువారం ఉదయం 9 గంటల నుంచి బండిఆత్మకూరు మండలానికే దాదాపు వంద బస్సులు గ్రామాలకు చేరాయి. అలాగే శ్రీశైలం నియోజకవర్గంలోని అన్ని మండలాలకు పెద్ద ఎత్తున బస్సులు వెళ్లాయి. కడప, అనంతపురం, చిత్తూరు, కర్నూలు జిల్లాలకు



బండి ఆత్మకూరు: కొద్ది మందితోనే వెళ్తున్న బస్సు

చెందిన వివిధ డిపోల బస్సులు గ్రామాలకు చేరుకున్నాయి. అయితే జనం మాత్రం మొక్కుబడిగా బస్సుల్లో పది, ఐదు మందితోనే తరలిపోవటం గమనార్హం. దారిలో బస్సులు ఆపి మద్యం అందించినట్లు సమాచారం. మొత్తానికి పలు గ్రామాల నుంచి జనం తరలింపు నాయకులకు తలనొప్పిగా మారిందనటంలో ఎలాంటి సందేహం లేదు.

పాణ్యం: మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశానికి జగన్ హాజరుకానున్న సందర్భంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గురువారం సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం రాత్రి ఎనిమిది గంటలు కావడంతో విద్యార్థులు అసహనానికి గురయ్యారు. నెరవాడ మెట్ట నుంచి నెరవాడకు వెళ్లడానికి పోలీసులు వాహనాలు అడ్డుగా ఉంచడంతో పాలు, సరుకులు తీసుకువెళ్లే ఆటో డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్డు దాటడానికి ఎలాంటి ఇబ్బందులు లేకపోయినా జగన్ రాకకు గంట ముందే వాహనాలు నిలిపివేశారు. దీంతో పాల వ్యాపారులు పాలు చెడపోతే ఎవరు సమాధానం చెబుతారని ప్రశ్నించారు. దీంతో పోలీసులు డ్రైవర్లకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. డ్రైవర్లందరూ సమీప పోలీసు అధికారిని నిలదీయడంతో చేసేదేమీలేక వాహనాలను వదిలారు. నెరవాడ మెట్ట వద్ద గల ఏపీ గిరిజన గురుకుల పాఠశాల, బీసీ గురుకుల పాఠశాల సిబ్బంది, వ్యాపారులు నెరవాడకు వెళ్లే వాహనాలు నిలిపివేయడంతో దాదాపు రెండు గంటల పాటు మెట్ట వద్దే వేచి ఉండాల్సి వచ్చిందని నెరవాడ గ్రామస్థులు వాపోయారు.

శాంతిరాం కళాశాల విద్యార్థుల ప్రతిభ

పాణ్యం, మార్చి 28: మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ విద్యార్థులు సాంకేతిక ప్రదర్శనలో అత్యంత ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన నంద్యాల ఎస్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన డిల్లాన2కె24 జాతీయ సాంకేతిక సదస్సులో ఈఈఈ విభాగానికి చెందిన షేక్ అర్షియా ప్రదర్శించిన స్మార్ట్ ఫర్మింగ్ ఇన్ అగ్రికల్చర్ అంశానికి ప్రథమ బహుమతి సాధించిందని చెప్పారు. ఈసీఈ విభాగానికి చెందిన కరీం, అతియరుక్సానాలు పవర్ ప్రజంటేషన్‌లో నానో టెక్నాలజీ ఇన్ ఎలక్ట్రానిక్స్ అంశానికి ద్వితీయ బహుమతి సాధించారని చెప్పారు. విద్యార్థులను కళాశాల ఎండీ శివరాం, హెచ్‌ఓడీ డాక్టర్ మల్లికార్జునరావు, కోఆర్డినేటర్ శంకర్‌నాథ్ అభినందించారు.

రేపు ఆత్మకూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ నాయకులు

ఆత్మకూరు, మార్చి 28: ఆత్మకూరు సీనియర్, జూనియర్ కోర్టుల పరిధిలోని బార్ అసోషియేషన్ ఎన్నికలను శనివారం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు కె. కేశవరెడ్డి, ప్రధాన కార్యదర్శి గొడుగు రవికుమార్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ బార్ అసోసియేషన్‌లో మొత్తం 41 మంది న్యాయవాదులు ఓటర్లుగా ఉన్నారని తెలిపారు. ఈ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ఆఫీసర్‌గా సీనియర్ న్యాయవాది పుల్లారెడ్డి, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది నూర్‌అహ్మద్ వ్యవహరించనున్నట్లు చెప్పారు.

వైభవంగా ప్రతిష్ఠ మహోత్సవం



మండ్లెంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

జూపాడుబంగ్లా, మార్చి 28: మండలంలోని మండ్లెం గ్రామంలో గురువారం అంబమల్లేశ్వర స్వామి దేవాలయం పునర్నిర్మాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో వేదమంత్రాలతో నిర్వహించారు. మూడు రోజులపాటు సంప్రదాయబద్ధంగా వేదపండితులతో హోమాలు నిర్వహించారు. ఉదయం హోమాలు, యంత్ర ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించి స్వామిని వేదమంత్రాలు, భాజభజంత్రీల మధ్య ప్రతిష్ఠించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

మినరల్ వాటర్ ప్లాంటు ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

నంద్యాల (కల్చరల్), మార్చి 28: నంద్యాల బొమ్మలసత్రంలో వెలసిన షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం సాయి వాటర్ ప్లాంట్‌ను మల్కిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, డాక్టర్ రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. హర్షగిరి వంశీ కృష్ణారెడ్డి, హర్షగిరి హర్షవర్దన్ రెడ్డి దాతల సహకారంతో గౌరీ శంకర సాయి సంఘం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఎండాకాలం కావడం వల్ల భక్తుల దాహార్తి కోసం వాటర్ ప్లాంట్ చాలా ఉపయోగమన్నారు. భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన హరికథ



హరికథ వినిపిస్తున్న హరిదాసు

శ్రీశైలం, మార్చి 28: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో గురువారం కర్నూలుకు చెందిన ఎం.వేణుభాగవతార్ బృందంతో శివలీలలు హరికథ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. కీబోర్డు సహకారాన్ని బి.ఆంజనేయులు, తబలా సహకారాన్ని జి. కృష్ణయ్య అందించారు.

అహోబిలంలో స్వాతి వేడుకలు



అహోబిలంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

నంద్యాల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి జన్మనక్షత్రమైన స్వాతి వేడుకలను వేదపండితులు గురువారం నిర్వహించారు. ముందుగా ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను విశేషంగా అలంకరించి, పూజలు చేశారు. అనంతరం 108 కలశాలతో సుదర్శన హోమం చేపట్టారు. స్వాతి వేడుకలను పురస్కరించుకొని భక్తులు నవనారసింహ క్షేత్రాలను దర్శించుకొని పూజలు చేసి సుదర్శన హోమంలో పాల్గొన్నారు. భక్తులకు వేదపండితులు తీర్థప్రసాదాలు అందించారు

పీఠాధిపతి పూజలు : అహోబిలం పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ మఠంలోని మాలోల నరసింహస్వామికి, స్వర్ణ నరసింహ స్వామికి స్వాతిని పురస్కరించుకొని పూజలు చేశారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు వేదపండితులు తీర్థప్రసాదాలు అందించారు.

నంద్యాల (కల్చరల్): నంద్యాల తెలుగుపేటలో వెలసిన మద్దులేటి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో గురువారం స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి సందర్భంగా స్వాతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా స్వామికి ఉదయం పంచామృత అభిషేకం, స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలు, పూలమాలలతో అలంకరించి నైవేద్యం సమర్పించి మహా మంగళ హారతి ఇచ్చారు. అర్చకులు శ్రీరామమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన నాయకులతో బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

నందికొట్కూరు మార్చి 28: నందికొట్కూరు నియోజకవర్గంలో వైసీపీకి షాక్ తగిలింది. నందికొట్కూరు మండలం బిజినవేముల గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు రమేష్ యాదవ్, శంకర్ యాదవ్, సుధాకర్ యాదవ్, బాలకృష్ణ యాదవ్, మధు యాదవ్ ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు గురువారం నందికొట్కూరులో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వైసీపీ వార్డు మెంబర్ యేసు రత్నం, ఇండిపెండెంట్ అభ్యర్థి అఖిల్, గ్రామానికి చెందిన ముఖ్య నాయకులతో పాటు ఎస్సీ, బీసీ, మైనార్టీలు, దాదాపు వంద కుటుంబాలు టీడీపీలో చేరాయి.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి: బుడ్డా



టీడీపీలో చేరిన నాయకులతో బుడ్డా రాజశేఖరరెడ్డి

వెలుగోడు, మార్చి 28: టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి కోరారు. గురువారం వేల్పనూరులోని స్వగ్రామంలో వెలుగోడు గండిపేటకు చెందిన చిన్న ఆంజనేయులు ఆధ్వర్యంలో చిన్న ఎల్లయ్య, కేశాలు రవికుమార్, భాస్కర్, మస్తాన్‌తో పాటు మరో 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ చేరాయి. వారికి మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు మండలంలో వైసీపీకి షాక్ తగిలింది. గురువారం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో వేల్పనూరులో సిద్ధపల్లె గ్రామ వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. సిద్దపల్లె గ్రామానికి చెందిన కుమ్మరి ఈశ్వరయ్య, లింగారెడ్డి, కాకుల శేఖర్,రమణయ్య, వెంకటకృష్ణారెడ్డి, శివారెడ్డి, కుమారి, రమేష్ తదితరులతో పాటు మరో 10 కుటుంబాలు వైసీపీ వీడి టీడీపీలో చేరాయి.

టీడీపీతోనే బీసీలకు న్యాయం: మాండ్ర



సమావేశంలో మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు మార్చి 28: టీడీపీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పట్టణ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, బీసీ సెల్ నాయకుడు వేణుగోపాల్ ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాండ్రతో పాటు నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మాండ్ర మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో ప్రశ్నించిన బీసీల్లో 74 మందిని హత్య చేసి ఘనత వైసీపీకే దక్కుతుందని అన్నారు. కొన్ని వేల మందిపై కేసులు నమోదు చేశారన్నారు. జయసూర్య మాట్లాడుతూ బీసీలను రాకీయంగా అభివృద్ధి చేసిన ఏకైక పార్టీ టీడీపీ అని అన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీలకు ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వకుండా, బీసీలకు అందించే సంక్షేమ పథకాలు, ఆదరణ పథకాలను రద్దు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. బీజేపీ నాయకుడు దామోదర్‌రెడ్డి, జనసేన నాయకుడు రవికుమార్, టీడీపీ నాయకులు గుండం రమణారెడ్డి, ఖాతా రమేష్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

- మిడ్తూరు మండలం గుడిపాడు గ్రామ వైసీపీ నాయకులు తిమ్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి, నడిపెన్న తదితరులు మాండ్ర శివానందరెడ్డి, జయసూర్య సమక్షంలో మండల కన్వీనర్ రమేష్‌రెడ్డి, రమణారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని మాండ్ర సూచించారు.

'టీడీపీ మేనిఫెస్టోకు ప్రజల్లో ఆదరణ'



యువతను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల (కల్చరల్), మార్చి 28: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోకు ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోందని, పథకాలకు ఆకర్షితులై భారీ ఎత్తున యువత టీడీపీలోకి చేరడం చాలా సంతోషంగా ఉందని నంద్యాల టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్, నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. గురువారంనంద్యాల 24వ వార్డు టీడీపీ నాయకులు సాయిరాం రాయల్ ఆధ్వర్యంలో 300 మంది మహిళలు గురువారం టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే నందమూరి నగర్ 37వ వార్డు నుంచి నంద్యాల టీడీపీ 1వ వార్డు కౌన్సిలర్ నాగార్జున, మాబువల్లి, మణికంఠ ఆధ్వర్యంలో దాదాపు 200 మంది యువకులు టీడీపీలో చేరారు. పార్టీలోకి చేరిన వారిలో నాజీర్, సమీర్, రజీఫ్, చోటు, ఖాదర్, రవి, గౌస్ ఉన్నారు.

వాహనాల తనిఖీ

ఆత్మకూరు, మార్చి 28: వచ్చే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం ఆత్మకూరు పట్టణంలో ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టినట్లు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలోని సంగమేశ్వరం సర్కిల్, నంద్యాల టర్నింగ్, ఫారెస్ట్ చెక్‌పోస్టు తదితర ప్రదేశాల్లో బీఎస్ఎఫ్ జవాన్లతో కలిసి వాహనాల తనిఖీలను చేపట్టినట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా వాహనదారులు పరిమితికి లోబడి మాత్రమే నగదు తీసుకెళ్లాలని, వాటికి సంబంధించిన ఆధారాలు కూడా ఉండాలని తెలిపారు. అదేవిధంగా అక్రమ మద్యం, డబ్బును కూడా తరలించరాదని హెచ్చరించారు. తమ వాహన తనిఖీల్లో ఎవరైనా పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఆత్మకూరులోని నంద్యాల టర్నింగ్‌లో వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

31 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

వెలుగోడు, మార్చి 28: మండలంలోని వేల్పనూరు గ్రామంలో ఈస్టర్ పండుగ సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బాలు, రాజేష్, వెంకటేష్‌లు తెలిపారు. ఈ పోటీలు సిఎస్ఐ చర్చి ఆవరణలో ఈ నెల 31వ తేదీన మొదలవుతాయన్నారు. పోటీల్లో గెలిచిన విజేతలకు మొదటి ఆరు బహుమతులు వరుసగా రూ.12,116, రూ.8,116, రూ.6,116, రూ.4,116, రూ.2116, రూ.1,116 అందజేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 6309480816 నెంబరును సంప్రదించాలని సూచించారు.

రేపు వాహనాల వేలం

ఆత్మకూరు, మార్చి 28: ఆత్మకూరు సెబ్ స్టేషన్ పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు శనివారం ఉదయం 11గంటలకు వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆత్మకూరులోని అక్కిరాజు కాలనీలో గల సెబ్ కార్యాలయం వద్ద నంద్యాల ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల పాటాదారులు రూ.3వేలు డిపాజిట్ చెల్లించి ఆధార్ వివరాలతో వేలం పాటలో పాల్గొనవచ్చునని సూచించారు. మరిన్ని వివరాలకు స్థానిక సెబ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

దత్తాత్రేయ స్వామికి పూజలు

శ్రీశైలం, మార్చి 28: శ్రీశైలం మహా క్షేత్రంలో గురువారం మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద ఉన్న దత్తాత్రేయ స్వామికి లోకకల్యాణం కోసం విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహా గణపతి పూజలు చేసి, అనంతరం దత్తాత్రేయ స్వామికి పంచామృతాభిషేకం, విశేష పూజలు జరిపారు.

ప్రమాదకరంగా రహదారి

- సైడ్ బరం లేకపోవడంతో ప్రమాదాలు
- భయాందోళనలో వాహనదారులు, ప్రయాణికులు

బండిఆత్మకూరు, మార్చి 28: నంద్యాల, ఆత్మకూరు ప్రధాన రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. బండిఆత్మకూరు మండలంలో రోడ్డుకు ఇరువైపులా పలు చోట్ల కనీసం మీటర్ సైడ్ బరం లేదు. ముఖ్యంగా పెద్ద దేవళాపురం వద్ద వందల మీటర్ల కొలదీ, అలాగే బండిఆత్మకూరు సుంకులమ్మ ఆలయం ఎదురుగా, సంతజూటూరు ఆంజనేయస్వామి మలుపు వద్ద, మరికొన్ని చోట్ల సైడ్ బరం లేదు. ఈ నెల 22న బండిఆత్మకూరు ఓంకారం ఆర్చీ ఎదుట సైడ్ బరంలేక పోవటంతో మినీలారీ, ఆర్టీసీ బస్సు సైడ్ వెళ్ల లేక ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 15 మంది గాయాలపాలయ్యారు. సైడ్ బరం లేని చోట్ల వాహనాల్లో గోతుల్లో పడటంతో పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా ఎన్నో ఉన్నాయి. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు సైడ్ బరం ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదం జరిగిన చోట సైడ్ బరం లేని దృశ్యం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బస్సు (ఫైల్)

వైసీపీ శని వదిలించుకుందాం

మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



టీడీపీలో చేరిన వారితో కోట్ల సుజాతమ్మ

డోన్, మార్చి 28: రాష్ట్ర ప్రజలకు పట్టిన వైసీపీ శనిని ఓటుతో ఓడించి వదిలించుకుందామని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. గురువారం పట్టణంలోని ఓబులాపురం టీడీపీ నాయకుడు శేషిరెడ్డి నివాసంలో దేవరబండ గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు వడ్డె బాలాంజనేయులు, పెద్ద రంగన్న, రవి, మారెప్ప, వీరాంజనేయులు, జనార్దన్, లక్ష్మీనారాయణ రెడ్డితో పాటు మరో 20 మంది టీడీపీ కార్యకర్తలు కోట్ల సుజాతమ్మ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ ఐదేళ్ల నుంచి సీఎం జగన్ రాష్ట్ర ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్నారని మండిపడ్డారు. నియంతృత్వ పోకడలతో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. డోన్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని గొప్పలు చెప్పుకుంటున్న మంత్రి బుగ్గన ఓసారి పల్లెల్లో, పట్టణాల్లోని వీధులను చూస్తే ప్రజల ఇబ్బందులు తెలుస్తాయన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు



డ్రోన్‌లపై శిక్షణ ఇస్తున్న కేవీకే సీనియర్ సైంటిస్టు ధనలక్ష్మి

బనగానపల్లె, మార్చి 28: పట్టణ శివారులోని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో డ్రోన్‌ల నిర్వహణపై ఆరు రోజులపాటు గ్రామీణ యువకులకు నిర్వహించిన శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. శిక్షణలో పాల్గొన్న యువకులకు సీనియర్ సైంటిస్టు ధనలక్ష్మి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈసంద ర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయంలో నూతన సాంకేతికపై గ్రామీణ యువత నైపుణ్యాన్ని పెంచుకోవాలని, డ్రోన్ పైలట్స్‌గా రాణించి సొంతంగా ఉపాధి పొందాలని కోరారు. టెక్నికల్ ఏఈ మధుమతి మాట్లాడుతూ డ్రోన్‌లపై శిక్షణ కోసం ఆసక్తిగల వారు మండల వ్యవసాయాధికారుల ద్వారా సంప్రదించాలన్నారు. డ్రోన్ విడిభాగాల పనితీరు, రిమోట్ కంట్రోల్, పైలట్స్‌కు ఉండాల్సిన అర్హతలను వ్యవసాయ ఇంజనీర్ సోహైల్ వివరించారు. ఆత్మ బీటీఎం చక్రవర్తి నాయక్, కేవీకే శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, రవిగౌడ్ పాల్గొన్నారు.

పాలిసెట్ ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు

బేతంచెర్ల, మార్చి 28: పట్టణంలోని శేషారెడ్డి పాఠశాలలో పాలిసెట్ ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ రాజేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్‌లో ప్రవేశించే విద్యార్థుల కోసం ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. కోచింగ్ సెంటర్ ఈనెల 30న ప్రారంభమవుతుందని, ఆర్టిఫీషియల్, మిషన్ లర్నింగ్, కోర్సు మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్‌పై నాలుగు కోర్సు లకు సంబంధించి ఓసీ, బీసీలకు రూ.400, ఎస్సీ, ఎస్టీకు రూ.100 దరఖాస్తు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఏప్రిల్ 5వ తేదీ దరఖాస్తులకు చివరి తేదీ అన్నారు. ఏప్రిల్ 27న పరీక్షలు నిర్వహిస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు.

కలవటాలలో ఉచిత వైద్య శిబిరం

కొలిమిగుండ్ల, మార్చి 28: మండలంలోని కలవటాల గ్రామంలో రామ్‌కో సిమెంట్ పరిశ్రమ యజమాన్యుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, శ్వాసకోశ, ఉదరకోశ తదితర వ్యా.ధులకు వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

వ్యక్తిపై దాడి

కొలిమిగుండ్ల, మార్చి 28: మండలంలోని చింతలాయ పల్లె గ్రామంలో పక్కీర అనే వ్యక్తి పాతకక్షలు మనసులో పెట్టుకొని బుధవారం రాత్రి అదే గ్రామానికి చెందిన చిన్నబాల సుంకన్న ఇంటి వద్దకు వెళ్లి తలపైన రాయితో కొట్టగా బాలసుంకన్నకు తీవ్ర గాయాలైనట్లు హెడ్‌కానిస్టేబుల్ నరసింహులు గురువారం తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ నరసింహులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పూజారికి గాయాలు

ప్యాపిలి, మార్చి 28: పట్టణ సమీపంలోని వైభవ్ డాబా దగ్గర 44వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పూజారి గిరిమనోహర్‌స్వామికి గాయాలయ్యాయి. ప్యాపిలికి చెందిన గిరిమనోహర్ స్వామి వివాహం జరిపించడానికి గుత్తికి వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి బైకుపై ప్యాపిలికి బయలు దేరారు. వైభవ్ డాబా దగ్గకు రాగానే కర్నూలు నుంచి అనంతపురం వైపు వెళ్లతున్న లారీ బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పూజారికి గాయాలయ్యాయి. కర్నూలు ఆస్పత్రికి ఆయనను తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జగన్‌ను జైలుకు పంపడానికి జనం సిద్ధం

డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, మార్చి 28: సీఎం పదవిని అడ్డం పెట్టుకుని విచ్చలవిడిగా అవినీతికి పాల్పడిన వైఎస్ జగన్‌ను ఓడించి జైలుకు పంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని కేంద్ర మాజీ మంత్రి, డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం డోన్ పట్టణంలోని కొండపేటలోని పలు వార్డులలో కూతురు కోట్ల నివేదితతో కలిసి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్ర కాష్ రెడ్డి మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని నాశనం చేశారని, అది చాలదన్నట్లు మళ్లీ మేమంతా సిద్ధం అని సిగ్గు లేకుండా వస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సీఎం జగన్ దోపిడీ పాలనకు ముగింపు పలికి ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు ఇవ్వడానికే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయన్నారు. మంత్రి బుగ్గనను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై. నాగేశ్వరరావు యాదవ్, కోట్రికే ఫణిరాజ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ సర్పంచ్ టీఈ కేశవయ్యగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, ఓబులా పురం శేషిరెడ్డి, సుధీష్, ఎస్ఎండీ రఫి, గురుస్వామి యాదవ్, కిరణ్ యాదవ్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించిన కోట్ల: పట్టణంలోని మర్రి చక్రపాణి పెట్రోల్ బంకు పక్కన మైదానంలో ఏర్పాటు చేసిన టీడీపీ పట్టణ కార్యాలయాన్ని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ముందుగా కోట్ల నివేదితతో కలిసి టీడీపీ కార్యాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడి నుంచే పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తామని పార్టీ నాయకులు తెలిపారు.



కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం: కోట్ల

డోన్ నియోజకవర్గంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని కొండపేటలో వైసీపీకి చెందిన ఎరుకల సుబ్బరాయుడు కుటుంబంతోపాటు 20 కుటుంబాలు కోట్ల సమక్షంలో, గురుస్వామి యాదవ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ రోడ్ల వెడల్పులో రైల్వే బ్రిడ్జి నిర్మాణంలో ఇల్లు కోల్పోయిన వారికి స్థలాలు చూపించి ఇళ్లు కట్టించే బాధ్యత మంత్రి బుగ్గనకు లేదా అని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వం రాగానే స్థలాలు కోల్పోయిన వారందరికీ పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామకృష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మార్కెట్ యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, భాస్కర్ నాయుడు, శ్రీనివాసభట్, లక్ష్మీనారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వాతి వేడుకలు



సుదర్శన హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

నంద్యాల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి జన్మనక్షత్రమైన స్వాతి వేడుకలను వేదపండితులు గురువారం నిర్వహించారు. ముందుగా ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను విశేషంగా అలంకరించి, పూజలు చేశారు. అనంతరం 108 కలశాలతో సుదర్శన హోమం చేపట్టారు. స్వాతి వేడుకలను పురస్కరించుకొని భక్తులు నవనారసింహ క్షేత్రాలను దర్శించుకొని పూజలు చేసి సుదర్శన హోమంలో పాల్గొన్నారు. భక్తులకు వేదపండితులు తీర్థప్రసాదాలు అందించారు

పీఠాధిపతి పూజలు : అహోబిలం పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ మఠంలోని మాలోల నరసింహస్వామికి, స్వర్ణ నరసింహ స్వామికి స్వాతిని పురస్కరించుకొని పూజలు చేశారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు వేదపండితులు తీర్థప్రసాదాలు అందించారు.

రుద్రవరం: రుద్రవరం గ్రామ సమీపంలోని దొర్నీ లక్ష్మీనర సింహ స్వామి జన్మనక్షత్రం స్వాతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు నరసింహస్వామి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేసి ఏకాంత సేవలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.



పూజలు చేస్తున్న పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్

సుబ్బారెడ్డికి అభినందనల వెల్లువ



సుబ్బారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

డోన్, మార్చి 28: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులైన ధర్మవరం సుబ్బారెడ్డికి అభినందనలు వెలువెత్తుతున్నాయి. గురువారం పట్టణంలోని ఆయన నివాసంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలసి సుబ్బారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబును ముఖ్యమంత్రిగా చూడాలని రాష్ట్ర ప్రజలంతా ఎదురు చూస్తున్నారని అన్నారు. టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో పాటు పేదలకు సామాజిక పింఛన్ పేదరిక నిర్మూలనకు దోహదపడతాయని అన్నారు.

ప్రజా గళం సభను విజయవంతం చేయండి

కోవెలకుంట్ల, మార్చి 28 : బనగానపల్లె పట్టణంలో పెట్రోల్ బంకు కూడలి వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు జరిగే ప్రజాగళం సభను విజయవంతం చేయాలని కోవెలకుంట్ల మండల టీడీపీ అధ్యక్షుడు అమడాల మద్దిలేటి పేర్కొన్నారు, గురువారం ఆయన కోవెలకుంట్లలో విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 29వ తేదీన ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా చంద్రబాబునాయుడు బనగానపల్లెకు వస్తున్నారని తెలిపారు. బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అవుకు: బనగానపల్లె పట్టణంలో శుక్రవారం జరిగే ప్రజాగళం సభను విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు ఐవీ ఫక్కీర రెడ్డి, మురళీధర్ రెడ్డి, మొట్ల రామిరెడ్డి గురువారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా బనగానపల్లెకు చంద్రబాబు ఉదయం 11 గంటలకు పెట్రోలు బంక్ కూడలికి చేరుకొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారన్నారు. బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో అవుకు, రామాపురం, కుని కుంట్ల, కాశీపురం, వేములపాడు, మంగంపేట, సుంకేసుల, చెన్నంపల్లె, శింగనపల్లె తదితర గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు.

'ఎన్నికల నియమావళి పాటించాలి'

చాగలమర్రి, మార్చి 28: గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీ నాయకులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి ఆదేశించారు. గురువారం చాగలమర్రి టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన వైసీపీ జెండాలు, ఫ్లెక్సీలను తొలగించారు. ఆయన మాట్లాడుతూ సభలు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో జెండాలు, ఫ్లెక్సీలు ఉండకూడదన్నారు. గ్రామాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

చాగలమర్రి, మార్చి 28: చాగలమర్రిలోని బాలుర, సెయింట్ ఆన్స్ పరీక్ష కేంద్రాలను గురువారం ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ ఆయా పరీక్షా కేంద్రాల్లో 90 మంది విద్యార్థులు సంస్కృత పరీక్షలు రాయగా, ఆరుగురు గైర్హాజరయ్యారని తెలిపారు. ప్రశాంతంగా పది పరీక్షలు ముగిశాయన్నారు.

గడ్డివాములు దగ్ధం



కాలిపోతున్న గడ్డి వాములు

ఉయ్యాలవాడ, మార్చి 28: మండలంలోని రూపనగుడి గ్రామంలోని చాకలి చిన్న కొండయ్య, పెద్ద కొండయ్యలకు చెందిన నాలుగు గడ్డి వాములు, 30 ఎకరాల్లోని శనగ పొట్టు దగ్ధమైంది. గురువారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు పక్కన ఉన్న చెత్తకు నిప్పు పెట్టటంతో ఆ నిప్పు గాలికి కొట్టుక వచ్చి పక్కనే ఉన్న రైతుల గడ్డి వాములపై పడింది. దీంతో గడ్డి వాములు పూర్తిగా కాలిపోయాయి. ఆళ్లగడ్డ ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వటంతో వారు హుటా హుటిన అక్కడి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. దాదాపు రూ. 2 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కమిషనర్

డోన్(రూరల్), మార్చి 28: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని డోన్ మున్సిపల్ కమిషనర్ జయరాం, పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పట్టణంలోని చిగురుమానుపేట ప్రభుత్వ పాఠశాల, గుత్తి రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, పోలిస్‌స్టేషన్ లో రోడ్డులో ఉన్న శ్రీసుధ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను కమిషనర్ పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ ఇంజనీర్ రసూల్, టౌన్ ప్లానింగ్ అధికారి అంజాద్‌బాషా తదితరులు ఉన్నారు.

పాములపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న మహ్మద్ ఇద్రిస్ ఖాన్

డోన్(రూరల్), మార్చి 28: డోన్ పట్టణ సమీపంలో ఉన్న నగర వనంలో విద్యార్థులకు పాములపై అవగాహన కార్యక్రమాన్ని డోన్ అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాముల జీవన విధానం, ప్రకృతిలో పాముల ప్రాధాన్యత, పాముల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ఈజీడబ్ల్యూఎస్ స్నేక్ రెస్క్యూర్ మహ్మద్ ఇద్రిస్ ఖాన్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పి.ప్రవీణ్‌కుమార్, సెక్షన్ ఆఫీసర్ ఈ.శివకుమార్, బీట్ ఆఫీసర్లు భారతి, శివమ్మ, సేంజో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేయండి

కోవెలకుంట్ల, మార్చి 28: సీఎం జగన్‌మోహన్ రెడ్డి, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేయాలని నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అందనం దేవరాజు గురువారం కోరారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు మేనిఫెస్టోను విడుదల చేయాలనే ఆలోచన ఇద్దరికి రాకపోవడం చాలా దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు దివ్యాంగులు, నిరుద్యోగులు, దళితుల సమస్య లపై తమ మేనిఫెస్టోలో ప్రకటించాలని కోరారు.

సీనియారిటీ ప్రకారమే ఎన్నికల అధికారిని నియమించాలి



తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

ప్యాపిలి, మార్చి 28: సీనియారిటీ ప్రకారమే ఉపాధ్యాయులను ఎన్నికల ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులుగా నియమించాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు గురువారం తహసీల్దారు ప్రతాప్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని తహసీల్దారు హామీ ఇచ్చారు. ఆయనను కలిసిన వారిలో సంఘం నాయకులు నరసింహారెడ్డి, లతీఫ్, నెల్లూరప్ప, నారాయణ, రమేష్‌నాయుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రుద్రవరం, మార్చి 28: మండలంలోని తువ్వపల్లె గ్రామానికి చెందిన మబ్బు లక్ష్మీనరసయ్య(34) చికిత్స పొందుతూ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ రామసుబ్బయ్య తెలిపారు. గత కొన్నేళ్ల నుంచి ఆరోగ్యం సరిగా లేక, అప్పుల బాధతో వైద్యం కూడా చేయించుకోలేక జీవితంపై విరక్తి చెందిన లక్ష్మీనరసయ్య బుధవారం గొర్రెలు, మేకలు మేపేందుకు వెళ్లి గడ్డిమందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే కోలుకోలేక మృతి చెందారు. భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

రోగులకు అన్నదానం



రోగులకు అన్నం వడ్డిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నంద్యాల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు లయన్స్ క్లబ్ వారు గురువారం అన్నదానం చేశారు. క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి రోజు రోగులకు గత 866 రోజుల నుంచి దాతల సహకారంతో అన్నం వడ్డిస్తున్నట్లు క్లబ్ ఉపాధ్యక్షుడు గంగన్న చెప్పారు. రోగులకు అన్నం దానం చేయాలన్న సేవాదృక్పథం గల దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు.

క్షుద్రపూజల కలకలం

రుద్రవరం, మార్చి 28: రుద్రవరంలో బుధవారం రాత్రి ఓ ఇంటి స్థలం ముందు నిర్వహించిన క్షుద్ర పూజలు గురువారం కలకలం తెప్పించాయి. భాస్కరనందీశ్వర ఆలయానికి అతి సమీపంలో ఈ క్షుద్ర పూజలు చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.



క్షుద్రపూజలు చేసిన దృశ్యం

కేంద్ర బలగాల కవాతు

కర్నూలు, మార్చి 28: త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్ఐ వెంకట సురేష్ ఆధ్వర్యంలో అమ్మ హాస్పిటల్, సాంస్కృతి పార్క్, డాక్టర్స్ కాలనీల్లో కేంద్ర బల గాలతో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు



చాగలమర్రిలో సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

రుద్రవరం, మార్చి 28: రుద్రవరం, చందలూరు గ్రామాల్లో సాయినాథుడికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. చందలూరు గ్రామంలో సాయినాథుడి విగ్రహానికి అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. రుద్రవరంలో సాయినాథుడి చిత్రపటానికి పూలమాలలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు చేశారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని సాయినాథ మందిరంలో గురువారం వేద పండితుడు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం జల, క్షీరాభిషేకాలు, మహన్యాస రుద్రాభిషేకం, సాయివ్రతం పూజలు నిర్వహించారు. మహిళలు సామూహికంగా సాయివ్రతం చేశారు. ప్రత్యేక హారతులు ఇచ్చి పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు లక్ష్మీనారాయణ, సుబ్బారావు, నాగభూషణం, రఘురామ్ పాల్గొన్నారు.

రేపు పీవోలకు శిక్షణ

చాగలమర్రి, మార్చి 28: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ రోజు విధులు నిర్వహించే పీవో, ఏపీవోలకు శనివారం ఆళ్లగడ్డలో ఎన్నికల విధుల నిర్వహణపై శిక్షణ ఇస్తున్నట్లు తహసీల్దార్ రమణమ్మ తెలిపారు. 111 మంది పీవో, ఏపీవోలను నియమించామని చెప్పారు. ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నియామక పత్రాలను ఎంఈవో న్యామతుల్ల గురువారం పంపిణీ చేశారు. పీవో, ఏపీవోలు తప్పనిసరిగా శిక్షణకు హాజరై విధుల్లో పాల్గొనాలని చెప్పారు.

టీడీపీ కూటమి విజయం తథ్యం: బీజేపీ

డోన్(రూరల్), మార్చి 28: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం తథ్యమని బీజేపీ డోన్ అసెంబ్లీ కన్వీనర్ సందు వెంకటరమణ అన్నారు. గురువారం సాయంత్రం డోన్ అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మను బీజేపీ నాయకులు కలిశారు. డోన్‌లో తెలుగుదేశం పార్టీ విజయానికి బీజేపీ నాయకులు పని చేస్తారని సందు వెంకటరమణ అన్నారు. నాయకులు బొగ్గరపు నటరాజ్, సందు రాజశేఖర్, బొంకూరి రవికుమార్, ఒంటెద్దు బండి కిరణ్, బాలక్రిష్ణ, బద్రి సుధాకర్ పాల్గొన్నారు.

టీడీపీలోకి ఎంపీ ప్రధాన అనుచరుడు



టీడీపీలో చేరిన వారితో భూమా అఖిలప్రియ

ఉయ్యాలవాడ, మార్చి 28: ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ప్రధాన అనుచరుడు, మండల కేంద్రంలోని దళిత కాలనీకి చెందిన గుండ్లకుంట జయన్నతోపాటు గుండ్లకుంట భాస్కర్, జకరయ్య, ఏసుపాదం, బొల్లు ఏసన్నతోపాటు మరో 50 దళిత కుటుంబాలు గురువారం అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరాయి. వీరికి అఖిలప్రియ, భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, భార్గవరామనాయుడు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం దళితులను ఎంతో మోసం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు బోరెడ్డి శేఖర్ రెడ్డి, కుడాల నారాయణరెడ్డి, మారంరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, పేరెడ్డి మోహన్‌రెడ్డి, బోరెడ్డి నర్శిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, పల్లెబాబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయి: అఖిల ప్రియ

చాగలమర్రి: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు రోజులు దగ్గరపడ్డాయని ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. గురువారం చాగలమర్రి గ్రామంలోని బుగ్గవీధి, గిరిజన కాలనీలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అఖిలప్రియ ఇంటింటికి తిరిగి టీడీపీ సూపర్-6 మ్యానిఫెస్టో కరపత్రాలను అందజేశారు. ఆమె మాట్లాడుతూ వైసీపీ నేతలు మేమంతా సిద్ధం అంటూన్నారని, అయితే రాష్ట్ర ప్రజలు మాత్రం వైసీపీని ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. యర్రగుంట్లలో జరిగిన రైతుల ముఖాముఖి సభకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వకుండా పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో అన్సర్‌బాషా, సల్లా నాగరాజు, నరసింహారెడ్డి, గుత్తి నరసింహులు, ఉసేన్‌వలి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లెలో టీడీపీ దూకుడు

- నియోజకవర్గంలో బీసీ జనార్దన్ రెడ్డి హవా
- టీడీపీలోకి వలసల వెల్లువ
- ఇప్పటికే ఖాళీ అయిన యండ్లపల్లె గ్రామం
- వైసీపీలో నిస్తేజం... టీడీపీలో జోష్
- బీసీజేఆర్ వెల్ఫేర్ ట్రస్టు నుంచి పేదలకు సేవలు
- గతంలో షాదీఖానా నిర్మాణానికి సహకారం
- ఆలయాలకు, చర్చిలకూ చేయూత
- గత ప్రభుత్వ హయాంలోనే దద్దణాలకు మహర్దశ
- నేడు ఆ ప్రాజెక్టును పట్టించుకోని ప్రభుత్వం
- నియోజకవర్గంలో జోరుగా టీడీపీ శ్రేణుల ఇంటింటి ప్రచారం


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న బీసీ





పేదలకు తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి (ఫైల్)

బనగానపల్లె పేరు చెప్పగానే ఫ్యాక్షన్ గుర్తుకు వస్తుంది. ఆధిపత్యం కోసం కొంతమంది రేపిన చిచ్చులో లెక్కలేనంత మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ముఠా నాయకులు మాత్రం ఆ తర్వాత రాజకీయాల్లో చేరి నాయకులుగా చలామణి అయ్యారు. వారి వెంట తిరిగిన వారు అన్ని విధాల నష్టపోయి ఇబ్బందుల పాలయ్యారు. నంద్యాల జిల్లా రాజకీయాల్లో బనగానపల్లెకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ నియోజకవర్గంలో నాపరాతి పరిశ్రమతో పాటు విలువైన ఖనిజ భూములు, సాగునీటి ప్రాజెక్టులు ఎన్నో ఉన్నాయి. కోవెలకుంట్ల నియోజకవర్గం తర్వాత బనగానపల్లె నియోజకవర్గం ఆవిర్భవించింది. బనగానపల్లె నియోజకవర్గంలో 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ తరఫున బీసీ జనార్దన్ రెడ్డి పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత ఆయన ఆలోచనలకు అనుగుణంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించారు. ఆ తర్వాత 2019 ఎన్నికల్లో ఓడిపోయినా.. తన సేవలను అందించడం ఎక్కడా ఆపలేదు. అధికారం ఉన్నా లేకపోయినా నియోజకవర్గంలో తన వంతు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు ఆయన. నియోజకవర్గంలో పేద ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నారు. ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మ, సోదరులు బీసీ రాజారెడ్డి, బీసీ రామనాథరెడ్డి కూడా పేదలకు సాయం చేస్తూ తమ మార్క్ రాజకీయాలను చూపుతున్నారు.

- నంద్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి)/ బనగానపల్లె

లోకేశ్ యువగళంలో కీలక పాత్ర..

రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత బీసీ తనకంటూ ఓ మార్కు సంపాదించుకున్నారు. నిత్యం టీడీపీ కోసం నిరంతరం శ్రమిస్తూ సైనికుడిలా పని చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ అధికారంలోనికి వచ్చేందుకు తన వంతు సాయం అందిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన నారా చంద్రబాబునాయుడు నెల్లూరు, ఒంగోలు జిల్లాల పార్లమెంట్ కోఆర్డినేటర్‌గా నియమించారు. ఇక టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ గతేడాది చేపట్టిన యువగళం పాదయాత్రలో బీసీ జనార్దన్‌రెడ్డి కీలక పాత్ర పోషించారు. నంద్యాల, జిల్లాతోపాటు నెల్లూరు, ఒంగోలు జిల్లాల పార్లమెంట్ కోఆర్డినేటర్‌గా మూడు జిల్లాల్లోను యువగళం పాదయాత్రలో నారా లోకేశ్‌కు వెన్నంటి ఉన్నారు. మూడు జిల్లాల్లో నిర్వహించిన యువగళం పాదయాత్రలో అన్ని రోజులు లోకేశ్ తోపాటు పాల్గొన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలైన 'మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అన్నదాత పథకం కింద రైతులకు సంవత్సరానికి రూ.20వేలు, తల్లికి వందనం కింద బడికి పోయే పిల్లలకు కుటుంబంలో ఎంత మంది ఉన్నా సంవసత్సరానికి రూ.15వేలు, దీపం పథకం కింద సంవత్సరానికి 3 ఉచిత సిలిండర్లు, ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 చొప్పున సంవత్సరానికి రూ.18వేలు ఆర్థిక సాయం, యువగళం నిధి కింద నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు' వంటి వాటిని ప్రజల్లోనికి బలంగా తీసుకువెళ్లేందుకు బీసీ దంపతులు తీవ్రంగా కృషి చేస్తున్నారు.


బీసీ, చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన చల్లా సోదరులు

తాగునీటి పథకాల కోసం...


బనగానపల్లె నియోజకవర్గంలో నీటి వసతి ఉన్నా సరిగ్గా వినియోగించుకునే విధంగా మునుపటి నాయకులు ఆలోచన చేయలేదు. ముఖ్యంగా బనగానపల్లె మండలంలోని పడమటి పల్లెలతో పాటు, చెరువుపల్లె వంటి గ్రామాలు, అవుకు మండలంలోని కొన్ని గ్రామాలు తీవ్ర నీటి ఎద్దడితో, కరువు కాటకాలతో అల్లాడుతుండేవి. ఈ పరిస్థితిని గత ప్రభుత్వంలో సీఎంగా ఉన్న చంద్రబాబునాయుడు దృష్టికి అప్పటి ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి తీసుకువెళ్లారు. ఈ పరిస్థితి మారాలంటే.. ఎస్సార్బీసీ ద్వారా నీటిని దద్దణాల చెరువులోకి ఎత్తిపోస్తే బనగానపల్లె పడమటి పల్లెలు, అక్కాజెమ్మ చెరువులోకి ఎత్తిపోస్తే చెరువుపల్లెతో పాటు చుట్టు పక్కల గ్రామాలు, అవుకు మండలంలోని సంగపట్నం చెరువుకు అవుకు రిజర్వాయర్ ద్వారా నీటిని నీటిని ఎత్తిపోస్తే అక్కడి చుట్టు పక్కల పల్లెల సమస్య తీరుతుందని చంద్రబాబుకు వివరించారు. చంద్రబాబు పచ్చజెండా ఊపడంతో రూ.21.01 కోట్లతో దద్దణాల ఎత్తిపోతల పథకానికి, రూ.2.65 కోట్లతో సంగపట్నం లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి, రూ.2.28 కోట్లతో అక్కాజమ్మ ఎత్తిపోతల పథకానికి బీసీ శ్రీకారం చుట్టారు. ఈ సాగునీటి పథకాలు అందుబాటులోకి రావడంతో ఆయా గ్రామాల్లో దాదాపు 1500 నుంచి



2500 ఎకరాల వరకు ఆయకట్టు పెరిగింది. అంతేగాకుండా చుట్టు పక్కల భూగర్భ జలాలు పెరగడంతో బోర్ల మీద ఆధారపడిన రైతులకు లబ్ధి చేకూరింది. దద్దనాల లిఫ్ట్ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయకుంటే రాజకీయాల నుంచి శాశ్వతంగా వైదొలుగుతానని అప్పట్లో ఆయన చేసిన శపథం సంచలనంగా మారింది. అనుకున్న విధంగానే గత టీడీపీ హయాంలో దద్దణాల ప్రాజెక్టు పూర్తయింది. అయితే అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రివర్స్ పాలనలో భాగంగా ఎస్సార్బీసీకి చెంతనే నీరు పారుతున్నా ఈ ప్రాజెక్టులపై నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

దద్దణాల ప్రాజెక్టుకు ఎనలేని కృషి

బీసీ జనార్దన్‌రెడ్డి రాజకీయాల్లోనికి అనూహ్యంగా వచ్చారు. ఆయన సోదరడు రాజారెడ్డి బనగానపల్లె పట్టణ సర్పంచ్‌గా ఉన్నా బీసీ ఏనాడు రాజకీయాల వైపు చూడలేదు. తన వ్యాపారం, సేవా కార్యక్రమాలతోనే బిజీగా గడిపారు. అయితే స్థానిక ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నియోజకవర్గ ప్రజలను మభ్యపెడుతుండటం చూసి బీసీకి నచ్చలేదు. ఇలాంటి నాయకులను ఎలాగైనా ఓడించాలనే ఉద్దేశంతో 2010లో తన రాజకీయ రంగప్రవేశానికి అన్ని సిద్ధం చేసుకున్నారు. 2011లో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. బీసీ చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయడు 2014 ఎన్నికల్లో బనగానపల్లె టికెట్‌ను బీసీకి కట్టబెట్టారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన మొదటిసారే బీసీ బలమైన ప్రత్యర్థి అయిన కాటసాని రామిరెడ్డిపై 17,341 ఓట్ల ఆధిక్యతతో గెలిచారు. బనగానపల్లె ఎమ్మెల్యేగా బీసీ 2014 నుంచి 2019 వరకు సుమారు రూ.1680 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. ముఖ్యంగా రూ.23 కోట్లతో దద్దణాల ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారు. అదే విధంగా రూ.6 కోట్లతో బనగానపల్లెలో అండర్ డ్రైనేజీ పనులతో, రూ.60 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి పథకాల పనులతో ప్రజలకు మాట ఇచ్చిన విధంగానే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించారు. ప్రభుత్వ నిధులకు తోడు తన సొంత నిధులను ఖర్చు చేస్తూ.. నియోజకవర్గం అంతటా 70 మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. అలాగే పేద యువతుల పెళ్లిళ్లకు బీసీ పెళ్లికానుకలు అందించారు. ఈ కానుకలో పెళ్లి కూతురికి తాళిబొట్టు, కాలి పట్టీలు, చీరలు ఇస్తున్నారు. ప్రతి ఏటా ఇలా నియోజకవర్గంలో ఆయన సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.


దద్దణాల ప్రాజెక్టు

నిరంతర సేవా కార్యక్రమాలు..

బీసీ జనార్దన్‌రెడ్డి మొదట కాంట్రాక్టర్, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు నిర్వహించేవారు. ఇలా ఓ వైపు వాపారాల్లో మునిగి ఉన్నా.. తన సోదరుడు, బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డితో కలిసి తండ్రి గుర్రెడ్డి పేరుతో సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకునేవారు. వీరిద్దరూ రాజకీయాలకతీతంగా సేవలు అందించేవారు. ఆ తర్వాత తన సోదరుడు చేస్తున్న సేవలకు తోడు తన సొంత పేరిట బీసీ ట్రస్టును ఏర్పాటు చేసి దాని ద్వారా కూడా సేవలు అందించడం మొదలుపెట్టారు. నియోజకవర్గ ప్రజలు మంచినీరు లేకుండా ఇబ్బందులు పడుతున్నారన్న ఉద్దేశంతో తన ట్రస్టు ద్వారా మినరల్ వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేశారు. కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం, క్రీడాకారులకు ప్రోత్సాహకాలు, దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, రోజువారి వ్యాపారాలు చేసుకునే వారి కోసం తోపుడు బండ్ల వంటివి అందించారు. ఇలా అవసరమైన వారికి చేయూతనిస్తున్నారు. దీనికి తోడు ఆయా వర్గాల వారు ఏదైనా నిర్మాణం చేపట్టాలన్నా.. మరే అవసరం వచ్చినా తనంతటతానుగా ముందుకు వచ్చి సాయం అందించారు. బీసీ జనార్దన్‌రెడ్డి చేస్తున్న సేవల్లో ఆయన సహచరి ఇందిరమ్మ కూడా పాలు పంచుకుంటున్నారు.



క్రీడాకారులకు ప్రోత్సాహం..

క్రీడాకారులకు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ప్రోత్సాహం అందిస్తున్నారు. పేద క్రీడా కారులకు బీసీతోపాటు ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మ జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణించాలని వందలాది మంది క్రీడాకారులకు ఆర్థిక సాయం అందించారు. అలాగే యువకులకు క్రికెట్ కిట్లు వందల కొద్ది పంపిణీ చేశారు. చదరంగం, బాక్సింగ్ వంటి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి బీసీ దంపతులు ఆర్థికంగా ప్రోత్సహిస్తున్నారు. బీసీ ఇందిరమ్మ ఏపీ థాయ్ బాక్సింగ్ చైర్మన్‌గా వ్యవహరించి బనగానపల్లెలో జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించారు.



ఇవీ సేవలు..

- రైతు బంధు బీసీ.. రైతులకు 120 ట్రాక్టర్లు అందించిన ఘనత బీసీది బీసీ జనార్దన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రైతులకు వ్యవసాయ ట్రాక్టర్ కొనుగోలు చేసుకోవడానికి వీలుగా లక్ష రూపాయలను ఉచితంగా అందించారు. ఇలా ఒకరిద్దరికి కాదు.. ఏకంగా నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని దాదాపుగా 120 మంది రైతులకు ఆర్థిక సాయం అందించి రైతుల పక్షపాతిగా నిలిచారు. అలాగే రూ.10 లక్షలతో పేద మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు.

మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు..

బనగానపల్లె నియోజకవర్గంలోని 5 మండలాల్లో ప్రజలకు సరిగ్గా తాగునీరు అందక ఇబ్బంది పడేవారు. వీరికి స్వచ్ఛమైన నీటిని అందించాలనే ఉద్దేశంతో బీసీ జనార్దన్ రెడ్డి తన సొంత నిధులతో పలు గ్రామాల్లో 70 మినరల్ వాటర్‌ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ప్లాంట్ల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేకంగా వాటర్‌బాయ్‌లను నియమించి వారికి నెల నెలా జీతాలు కూడా చెల్లిస్తున్నారు. ఇలా ఏర్పాటు చేసిన ప్లాంట్లకు ప్రతినెలా లక్షల్లో విద్యుత్ బిల్లు వస్తున్నా వెరవకుండా బీసీ, అధికారంలో లేకపోయినా ఈ ఐదేళ్ల నుంచి ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు.



మద్దిలేటి ఆలయానికి.. షాదీఖానా నిర్మాణానికి

బీసీ దంపతులు ఇటు రాజకీయాలతో పాటు సేవా కార్యక్రమాలు, ఆలయాలు, షాదీఖానాలు, చర్చిల నిర్మాణాలకు తమవంతుగా ఆర్థికసాయం చేసి కృషి చేశారు. లెక్కకు మించి గుప్తదానాలు చేస్తున్నారు. డబ్బులు లేక చికిత్స కోసం ఇబ్బందులు పడుతున్న ఎంతో మంది రోగులకు ఆర్థిక సాయం అందించి ప్రాణాలు కాపాడారు. టీడీపీ కార్యకర్త లకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా వెంటనే స్పందించి వారికి బీసీ ఆర్థిక సాయం అందించారు. దీనికి తోడు బనగానపల్లె పట్టణంలోని షాదీఖానా నిర్మాణానికి రూ.30 లక్షల విరాళం అందించారు. అలాగే కొండపేటలోని వెంకటేశ్వర స్వామి గుడి నిర్మాణానికి విరాళం అందించారు. బేతంచర్ల మండలంలోని శ్రీలక్ష్మి మద్దిలేటి స్వామి మెట్ల మార్గంతోపాటుపై కప్పు నిర్మాణానికి మొత్తం రూ.15 లక్షలతో పైకప్పు నిర్మించి భక్తులకు ఎండకు, వర్షానికి. ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశారు. చార్ కమాన్ మసీదుకు రూ.3 లక్షలు సొంత నిధులు వెచ్చించి గదులను నిర్మించారు. పేష్మాకు రూ.7 లక్షలతో సొంత ఇళ్లు నిర్మించి వారికి అందించారు.


బీసీ ఇందిరమ్మ సమక్షంలో పార్టీలో చేరుతున్న మహిళలు

వైసీపీ కేడర్‌ను కకావికలం చేస్తూ..

వైసీపీ పాలన మీద, స్థానిక ఎమ్మెల్యే మీద బనగానపల్లె నియోజవకర్గ ప్రజలు విసిగిపోయి ఉన్నారు. దీంతో ఎపుడు ఎన్నికలు వస్తే అపుడు వైసీపీని సాగనంపేందుకు వేచి చూస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాక ముందు నుంచి నియోజకవర్గంలోని వందలాది వైసీపీ కుటుంబాలు బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో చేరాయి. అవుకు, కొలిమిగుండ్ల, బనగానపల్లె, సంజామల, కోవెలకుంట్ల మండలాల నుంచి రోజూ చేరికలు జరుగుతూనే ఉన్నాయి. ఇందులో వైసీపీ సర్పంచులు కూడా ఉండటం గమనార్హం. చేరికలు జోరుగా ఉండటంతో నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లు ఫుల్ జోష్‌లో ఉన్నారు. దీనికి తోడు టీడీపీ-జనసేన, బీజేపీ పొత్తుతో ఇక్కడి ప్రజల్లో ఆమోదం లభించడంతో ఇక్కడ బీసీ గెలుపు నల్లేరు మీద నడక అన్న అభిప్రాయం అన్ని వర్గాల నుంచి వ్యక్తమవుతోంది. తన సతీమణి బీసీ ఇందిరమ్మ, సోదరులు బీసీ రాజారెడ్డి, బీసీ రామనాథరెడ్డిలతో పాటు టీడీపీ కార్యకర్తలు, నాయకులు, బూత్, క్లస్టర్, యూనిట్ సభ్యులతో కలిసి బనగానపల్లె నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగుర వేసేందుకు బీసీ జనార్దన్‌రెడ్డి సన్నద్ధమయ్యారు.

బీసీజేఆర్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

నియోజకవర్గంలో ఎక్కువగా రోజువారీ కూలీ చేసుకునేవారే అధికం. ఇందులో అసంఘటిత రంగంలోని కార్మికులు ఎక్కువ. పనికి వెళ్లే సమయంలో దురదృష్టవశాత్తు ఇలాంటి కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగితే ఆదుకునే నాథుడే ఉండడు. ఇలాంటి వారి కోసం బీసీజేఆర్ పేరిట బీసీ జనార్దన్‌రెడ్డి ఓ ట్రస్టు ఏర్పాటు చేశారు. కార్మికుల సంక్షేమం కోసం బీసీజేఆర్ ట్రస్ట్ అందించే సేవల్లో ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఉండేందుకు రూ.25 లక్షలను బ్యాంకులో డిపాజిట్ చేసి, ఈ ట్రస్టుకు చైర్‌పర్సన్‌గా ఆయన సతీమణి ఇందిరమ్మను నియమించారు. ఈ ప్రమాద బీమా పథకాన్ని బీసీ దంపతులు ఈ నెల 11న అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ పథకంలో పేరు నమోదు చేసుకున్న కార్మికులు ఎవరైనా ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.లక్ష బాధిత సభ్యులకు అందిచేలా ఏర్పాటు చేశారు. ప్రమాదం జరిగితే వైద్య ఖర్చులకు రూ.20వేలు బాధితుడికి తక్షణ ఆర్థిక సాయం అందించనున్నారు. నియోజకవర్గంలోని గౌండా, పాలిష్ కటింగ్, కార్పెంటర్లు, పెయింటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఆటో డ్రైవర్లు, ట్యాక్సీ డ్రైవర్లు, ఆటో మొబైల్ మెకానిక్‌లు, టైలర్లు వంటి వృత్తి పనులు చేసుకునే వారితో, వెల్డర్లు, హోటల్ కార్మికులు, కుమ్మరి కార్మికులు, ఫొటోగ్రాఫర్లకు ఈ బీమా పథకాన్ని బీసీ దంపతులు అందించనున్నారు.

